# మన క్రాంతి

KR TV

ఇది వాస్తవ పత్రిక...

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 02 సంచిక 112 | గురువారం 09 ఏప్రిల్ 2026 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 వెల: 3 రూ/-


## నేటి మాట


మనం హీనులమని
భావించుకుంటే నిజంగానే
హీనులమైపోతాం



-స్వామి వివేకానంద

## మీ రాజకీయాల కోసం ప్రాజెక్టులతో చెలగాటం ఆడొద్దు

### మంత్రి ఉత్తమ్‌కు హరీశ్ రావు లేఖ




న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ధ్వజమెత్తారు. ప్రాజెక్టుల్లోని భారీ మోటార్లను నిబంధనలకు విరుద్ధంగా పదే పదే ఆన్, ఆఫ్ చేస్తూ అశాస్త్రీయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. కాళేశ్వరం, దేవాదుల మోటార్లను పదే పదే ఆన్, ఆఫ్ చేయడంపై తీవ్ర ఆందోళన కలిగిస్తోందని భారీ నీటి పారుదల మోటార్లను ఇష్టానుసారం స్టార్ట్, స్టాప్ చేయడం ఇంజనీరింగ్ నిబంధనలకు విరుద్ధం అని ఇలా చేస్తే వైబ్రేషన్స్ వచ్చి పంపులు, ఇంప్లర్స్, మోటార్లు పాడైపోయే ప్రమాదం ఉందన్నారు. పంపులు, మోటార్లు పాడయ్యేలా కావాలనే కుట్రకు తెరలేపి ఆ నెపాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ పాలనాపరమైన నిర్లక్ష్యమా? లేక కావాలనే చేస్తున్న కుట్రనా? అని నిలదీశారు.

ఇంత నిర్లక్ష్యమా?:

భారీ మోటార్లు నిరంతరాయంగా నడిచేలా డిజైన్ చేసినవి, పదే పదే ఆపితే తీవ్ర నష్టం తప్పదని హరీశ్ రావు హెచ్చరించారు.

## వడ్డీరేట్లపై ఆర్బీఐ కీలక ప్రకటన




న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తన మొట్టమొదటి ద్వైమాసిక ద్రవ్య విధాన ప్రకటనను విడుదల చేసింది. ఏప్రిల్ 6న ప్రారంభమైన గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల సమావేశం ముగిసింది.

## ఉల్లిపాయలు కొనడానికి వెళ్తే..

### స్కూటీ డిక్కీలోని రూ.5 లక్షలు మాయం

- క్షణాల్లో నగదు మాయం
- జొన్నలగడ్డ బైపాస్‌లో ఘటన
- సీసీటీవీలో రికార్డు
- నిందితుడి కోసం పోలీసుల గాలింపు




## హైదరాబాద్‌లో దారుణం

- పైలట్ శిక్షణా విద్యార్థినిపై అత్యాచారం
- ఫోటోలు, వీడియోలతో బెదిరింపు
- జనవరి నుంచి కొనసాగిన దాడులు
- నిందితుడు అరెస్ట్, దర్యాప్తు కొనసాగింపు




## గవర్నర్‌కు బొత్స లేఖ

### ఆర్థిక వ్యవహారాలపై ఆరోపణలు

- పెరుగుతున్న రాష్ట్ర అప్పులు
- ఆఫ్-బడ్జెట్ అప్పులపై ఆందోళన
- రాజకీయంగా వేడెక్కుతున్న వివాదం





## తెలంగాణ రాజకీయాల్లో కవిత హాట్ టాపిక్

### 'టీఆర్ఎస్' పేరుపై కొత్త చర్చ

- కొత్త పార్టీపై కసరత్తు వేగం
- పాత ఉద్యమం-కొత్త అజెండా
- బీఆర్ఎస్‌కు షాక్ అవుతుందా?
- రాజకీయ సమీకరణాల్లో మార్పులు




## కాళేశ్వరం కమిషన్ పై తీర్పు వాయిదా




న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కాళేశ్వరం కమిషన్ నివేదికపై తీర్పు వాయిదా పడింది. రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపిన కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు, దాని విచారణ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు నేడు తుది తీర్పు వెల్లడించాల్సి ఉంది. ఈ క్రమంలో బుధవారం తీర్పు వస్తుందని అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో..

## ఏపీలో వార్డుల పునర్విభజన గడువు పెంపు

### అధికారుల స్పష్టీకరణ







న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో వార్డుల పునర్విభజన ప్రక్రియకు ప్రభుత్వం గడువును పొడిగించింది. ప్రస్తుతం క్షేత్రస్థాయి సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ యంత్రాంగం అంతా 2027 జనగణన పనుల్లో నిమగ్నమై ఉండటంతో, వార్డుల డీలిమిటేషన్ పనులకు ఆటంకం ఏర్పడినట్లు తెలుస్తోంది. దీంతో రెండు కీలకమైన ప్రక్రియలను ఏకకాలంలో నిర్వహించడం వల్ల ప్రస్తుత షెడ్యూల్ అమలు చేయడం కష్టతరంగా మారిందని అధికారులు నివేదిక సమర్పించారు. దీంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

వార్డుల పునర్విభజన లో జనాభా గణాంకాల ఖచ్చితత్వం, భౌగోళిక సరిహద్దుల క్షేత్రస్థాయి పరిశీలన అత్యంత కీలకమని అధికారులు స్పష్టం చేశారు. సరిహద్దుల సరిపోల్చడం, భౌగోళిక సవరణలు చేయడానికి మరింత సమయం అవసరమని వారు పేర్కొన్నారు. ఒకవేళ తొందరపాటుతో డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేస్తే, భవిష్యత్తులో సాంకేతిక తప్పులు, రాజకీయ వివాదాలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పారదర్శకమైన, లోపరహితమైన వార్డుల విభజన కోసమే ఈ అదనపు సమయాన్ని కేటాయించినట్లు ఈ సందర్భంగా ప్రభుత్వం వెల్లడించింది.

# భూభారతి పోర్టల్ సిద్ధం

# ఐదు మండలాల్లో పైలెట్

- డిపార్టుమెంట్ల సమన్వయం
- అధికారులకు అవగాహన అవసరం
- ధరణి లోపాల విశ్లేషణ
- శాశ్వత పరిష్కార దిశగా అడుగులు
- ప్యూరిఫైడ్ డేటా ప్రాధాన్యం
- సమగ్ర సేవలు ఒకే ప్లాట్‌ఫామ్‌లో
- యాచారం మోడల్ స్టడీ
- అమలుపై విమర్శలు




న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కొత్త భూ భారతి పోర్టల్ ను అమల్లోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ డిపార్టుమెంట్లను అనుసంధానం చేస్తూ సరికొత్త వ్యవస్థను రూపొందించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్మెంట్ సిస్టమ్ తో కూడిన సరికొత్త వెబ్ సైట్ ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

### ఐదు మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్

సామాన్యులకు అన్ని రకాల సేవలు సులభంగా అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో భూభారతిని తీర్చిదిద్దుతున్నారు. ముందుగా ఐదు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో ఈ నెల రెండో తేదీ నుంచి ఇంటిగ్రేటెడ్ పోర్టల్ ను మొదలుపెట్టారు. అమలుకు ముందే సిద్ధం చేసిన పోర్టల్, మాడ్యూల్స్ పై సీసీఎల్ఏ కార్యాలయంలో నిపుణులతో చర్చించారు. కొందరు నిపుణులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా దీనిపై వివరించారు.

### అవగాహన కల్పిస్తేనే..

కొత్త విధానం అమలులో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే దీనిపై కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. సీసీఎల్ఏ డీఎస్ లోకేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి భేటీలో అమలు విధి విధానాలపై చర్చించినట్లు తెలిసింది. కొత్త వెబ్ పోర్టల్ లో ఏయే సేవలు అందుబాటులో ఉంచాలన్న దానిపై ఐదు మండలాల్లో నెల రోజులు స్టడీ చేసిన తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఆ తర్వాతే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు.

### శాశ్వత పరిష్కారం చూపే దిశగా..

గతంలో ధరణి పోర్టల్ ను సైతం పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టారు. అయితే తలెత్తిన లోపాలను సరి చేయకుండానే అమలు చేయడం ద్వారా అనేక సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. డేటా అప్ లోడ్ చేయడంలో దొర్లిన తప్పులతో లక్షలాది మంది రైతులు ఇబ్బందులకు గురయ్యారు. మిగతాది 2 లో..

## నల్లజర్ల పీహెచ్‌సీలో భారీ అగ్నిప్రమాదం..




న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): నల్లజర్ల పీహెచ్‌సీలో బుధవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. తెల్లవారుజామున 4 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. భారీ ఎత్తున మంటలు ఎగసిపడగా.. మందులు ఉంచిన డిపార్ట్మెంట్ పూర్తిగా దగ్ధమయింది.అందులో ఉన్న ఫర్నీచర్, ఇతర వస్తువులు కూడా అగ్నికీలలకు ఆహుతయ్యాయి. పీహెచ్‌సీ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

## ప్రపంచశాంతికి గొప్పరోజు..

### పశ్చిమాసియాలో సువర్ణోధ్యాయం : ట్రంప్




న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఇరాన్ పై రెండువారాలపాటు కాల్పుల విరమణకు ఒప్పుకోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. ప్రపంచశాంతికి ఇది గొప్పరోజని మీడియా సమావేశంలో తెలిపారు.

# భూభారతి పోర్టల్ సిద్ధం..ఐదు మండలాల్లో పైలెట్

మొదటి పేజీ తరువాయి

పట్టా భూములు ప్రభుత్వానివిగా, ప్రభుత్వ భూములు పట్టాగా నమోదయ్యాయి. ఆర్ ఎస్ ఆర్ మిస్ మ్యాచ్ అంటూ భూమి ఉన్నోళ్ల ఖాతా నుంచి పేర్లు తొలగించారు. ఆ సమస్యలు ఆరేండ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ఈ ఫెయిల్యూర్స్ ను స్టడీ చేసి వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తున్నది.

**ప్యూరిఫైడ్ డేటా తో సక్సెస్:** పాత సమస్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రతి గ్రామ ప్రతి గ్రామ పహానీ అబ్ స్ట్రాక్ట్ ని సరి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అమ్మేసిన భూములకు సంబంధించి పాత యజమానుల రికార్డుల నుంచి విస్తీర్ణాన్ని డెలీట్ చేయాలి. ఆర్ ఎస్ ఆర్ మిస్ మ్యాచ్ లేకుండా రూపొందించిన ప్యూరిఫైడ్ డేటాను అప్లోడ్ చేయాలి. పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి. అప్పుడే ఇంటిగ్రేటెడ్ భూభారతి సక్సెస్ అవుతుందని నిపుణులు చెబుతున్నారు.

**సమగ్ర సేవలు:** ప్రస్తుతం నడుస్తున్న భూ భారతి పోర్టల్ అప్పటి ధరణి వెబ్ పోర్టల్ లోనే నడుస్తున్నది. అయితే ఈ పైలెట్ మండలాల్లో మెరిట్- డీమెరిట్ లను పరిశీలించి.. వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి.. రెండో దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పోర్టల్ ను అమలు చేయనున్నారు. ఒక్క క్లిక్ తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చేస్తున్నారు. సమాచార సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలు ఇందులో ప్రధానంగా ఉండనున్నాయి. సిటిజన్ డ్యాష్ బోర్డులో మై ల్యాండ్ పోర్ట్ ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నంబర్, దరఖాస్తు వివరాలు, మ్యుటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వే నంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్ వంటి పూర్తి సమాచారం ఉంటుందని చెబుతున్నారు.

**యాచారం మోడల్:** రాష్ట్రంలో భూ సమస్యలపై భూమి సునీల్ నేతృత్వంలో లీగల్ ఎంపవర్మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్ సొసైటీ (లీఫ్స్) అనే సంస్థ రంగారెడ్డి జిల్లా యాచారం మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని స్టడీ చేసింది. అక్కడ గుర్తించిన సమస్యలను, పరిష్కార మార్గాలను ప్రభుత్వానికి సమర్పించింది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో భూ సమస్యలు కూడా అధికం. సర్వే విస్తీర్ణం హెచ్చుతగ్గుదల, రికార్డుల్లోని సర్వే నంబర్లకు రైతుల పొషెషన్ కు మధ్య అంతు లేని అగాథం ఉంది. అందుకే ఈ మండలంలోని 10 గ్రామాల్లో సమస్యలను లీఫ్స్ స్టడీ చేసింది. రైతులకు అప్లికేషన్ ఫారాలను అందించి.. వాటిలో పాసుపుస్తకం, సర్వే నంబరు, సమస్య పేర్కొంటే సరిపోయే ఈజీ మెథడ్ ని అనుసరించారు. అలాంటి సమస్యలన్నింటినీ క్రోడీకరించి పరిష్కార మార్గాలను భూమి సునీల్ ఆధ్వర్యంలో టీమ్ రిపోర్ట్ రూపంలో తయారు చేసింది.

ఒక్కో అప్లికేషన్ ను రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి పొరపాట్లు, సమస్యలు, పరిష్కార మార్గాలను న్యాయవాదులు రూపొందించారు. వాటన్నంటినీ 12 రకాలుగా కేటగిరీ చేశారు. అయితే ధరణి మాడ్యూల్ ద్వారా ఈ 10 గ్రామాల్లో 900 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. కానీ లీఫ్స్ సంస్థ ప్రతినిధులకు 2200 లకు పైగా రావడం గమనార్హం. దాన్ని స్ఫూర్తిగానే నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలంలో అధికారికంగా పైలెట్ ప్రాజెక్ట్ గా స్టడీ చేశారు. అక్కడ ఎంజాయ్మెంట్ సర్వే కూడా చేశారు. ప్రధానంగా అటవీ ల్యాండ్, పట్టా ల్యాండ్, అసైన్డ్ ల్యాండ్స్ మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేశారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ఐదు మండలాల్లో సమగ్ర అధ్యయనం చేయనున్నారు.

**అధికారుల్లో అవగాహన లేమి:** ఇంటిగ్రేటెడ్ భూ భారతి పైలెట్ ప్రాజెక్టు పై రెవెన్యూ అధికారులకు అవగాహన లేదని విమర్శలు వస్తున్నాయి. అసలు ఇది పెట్టిన ఉద్దేశ్యమే ప్రచారంలోకి రాకపోవడం గమనార్హం. ఆర్డీవోలు సైతం భూ రీసర్వే అంటూ గ్రామసభలు నిర్వహిస్తుండడం గమనార్హం. భూ భారతి ఇప్పటికే అమలవుతున్నది. కొత్తగా అమల్లోకి తీసుకొస్తున్న అంశాలు, దాని వల్ల ప్రయోజనాలు జనానికి చెప్పడం లేదు. అందుకే ముందుగా అధికారులకు ఓరియెంటేషన్ నిర్వహిస్తే బాగుండేదన్న అభిప్రాయం నిపుణుల నుంచి వస్తుంది. పైగా పైలెట్ ప్రాజెక్టు అనడం పైన విమర్శలు వస్తున్నాయి. ఆల్రెడీ చట్టం అమలవుతున్న నేపథ్యంలో 'పైలెట్' ఎందుకన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఐదు మండలాల తహశీల్దార్లు, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లకు, కలెక్టర్లకు భూ భారతి చట్టం, మార్గదర్శకాలపై సమగ్ర అవగాహన ఉన్నప్పుడే సరిగ్గా అమలు చేయగలరని నిపుణులు అభిప్రాయపడ్డారు.

## హైదరాబాద్‌లో దారుణం.. పైలట్ శిక్షణా విద్యార్థినిపై అత్యాచారం

న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): భాగ్యనగరంలోని బేగంపేటలో ఉన్న ఒక ప్రముఖ పైలట్ శిక్షణా సంస్థలో దారుణం వెలుగుచూసింది. తన వద్ద శిక్షణ పొందుతున్న ఒక యువతిపై అదే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగి పలుమార్లు అత్యాచారానికి ఒడిగట్టిన ఘటన ఆలస్యంగా బయటపడింది. కేరళ రాష్ట్రానికి చెందిన నసీముద్దీన్ ను నిందితుడిగా గుర్తించారు. అదే సంస్థలో అడ్మినిస్ట్రేటివ్ లేదా టెక్నికల్ విభాగంలో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. పరిచయం పెంచుకుని, ఆమెకు తెలియకుండా కొన్ని వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు తీశాడు. వాటిని సోషల్ మీడియాలో పెడతానని, ఆమె కెరీర్‌ను నాశనం చేస్తానని బెదిరించి లోబరుచుకున్నాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2025 జనవరి నుంచి నిందితుడు బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం చేశాడని ఆరోపించారు. పోలీసులు నసీముద్దీన్ ను అరెస్ట్ చేసి, దర్యాప్తు చేపట్టారు.


## గవర్నర్‌కు బొత్స లేఖ.. ఆర్థిక వ్యవహారాలపై ప్రభుత్వం తప్పుడు సమాచారం



న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లేఖ రాశారు శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ.. ఈ లేఖ రాయడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలపై ప్రభుత్వం తప్పుడు సమాచారం అందిస్తున్నదని ఆయన లేఖలో ఆరోపించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లెక్కల విషయంలో ప్రభుత్వం పారదర్శకత పాటించడం లేదని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. రాష్ట్ర అప్పులు భారీగా పెరిగాయని, ప్రతి సంవత్సరం అప్పుల భారము అధికమవుతూనే ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

అదనంగా, ఆఫ్-బడ్జెట్ అప్పులు కూడా పెద్ద మొత్తంలో ఉన్నాయని ఆరోపించారు బొత్స సత్యనారాయణ.. అయితే 2024-25 మరియు 2025-26 సంవత్సరాల్లో కొత్త అప్పులు ఎక్కువగా తీసుకోలేదని ప్రభుత్వం చెబుతున్న విషయాన్ని బొత్స తప్పుబట్టారు. ఇది వాస్తవాలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ప్రజలకు తప్పుడు సమాచారం అందిస్తున్నదని పేర్కొంటూ, ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను బొత్స సత్యనారాయణ కోరారు. ఈ అంశంపై రాష్ట్ర రాజకీయాల్లో చర్చ మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. బొత్స లేఖపై కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది అనేది ఆసక్తికరంగా మారింది.

## గుండెపోటుతో మూడోతరగతి విద్యార్థి మృతి



న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): అప్పటిదాకా దైవ సన్నిధిలో కుటుంబ సభ్యులతో గడిపిన మూడోతరగతి విద్యార్థి గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తోపారపు చంద్రశేఖర్-నవిత దంపతుల కుమారుడు నిశాంత్ (9) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు.

మంగళవారం గ్రామ శివారులోని శివాలయంలో అన్నదాన కార్యక్రమానికి కుటుంబంతో కలిసివెళ్లాడు. అప్పటిదాకా కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపిన నిశాంత్ తోటి పిల్లలతో ఆడుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలిపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం జగిత్యాల దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

## విజయవాడలో పోలీసుల విస్తృత తనిఖీలు కారులో రూ.2 కోట్ల నగదు స్వాధీనం



న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): విజయవాడ అంబాపురం బైపాస్ రోడ్డు వద్ద బుధవారం ఉదయం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కారులో తరలిస్తున్న రూ.2 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాలోని బరంపురం నుంచి విజయవాడకు ఈ నగదును తరలిస్తున్నట్లుగా గుర్తించారు. కారులో ఉన్న వ్యక్తులు ఆ నగదుకు సంబంధించి సరైన ధృవీకరణ పత్రాలు చూపకపోవడంతో అది హవాలా సొమ్ము అయి ఉంటుందని అనుమానిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టుకున్న సొమ్మును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

## తెలంగాణ రాజకీయాల్లో కవిత హాట్ టాపిక్

న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): తెలంగాణ రాజకీయాలు ఆసక్తిని రేపుతున్నాయి. రాబోయే శాసనసభ ఎన్నికల కోసం ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నాయి. దశలవారీగా ప్రజల వద్దకు వెళ్తూ తమ ఆలోచనను ప్రజలకు వివరించేలా ప్రణాళికలు వేసుకుంటున్నాయి. ఈ క్రమంలో మాజీ సీఎం కేసీఆర్ కూతురు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ అంశం హాట్ టాపిక్ అవుతోంది. ఈ నెల 25వ తేదీన కొత్త పార్టీని అనౌన్స్ చేయబోతున్నట్లు కవిత ఇప్పటికే ప్రకటించగా ఆమె పెట్టబోయే పార్టీ పేరుపై కొత్త చర్చ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది.

పాత ఉద్యమ పార్టీ కొత్త ఎజెండాతో..

బీఆర్ఎస్‌తో తెగతెంపులు జరిగాక కవిత రాజకీయ ప్రస్థానం ఎలా ఉండబోతోంది అనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కూతురు కావడంతో ఆమె తీసుకోబోయే నిర్ణయంపై అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో తాను కొత్త రాజకీయ పార్టీ పెట్టబోతున్నట్లు చెప్పిన కవిత ఆ మేరకు కసరత్తును వేగవంతం చేశారు. అయితే నిన్న మొన్నటి వరకు కవిత కొత్త పార్టీ పేరుతెలంగాణ ప్రజా జాగృతి అనే ప్రచారం జరుగగా తాజాగా బిగ్ ట్విస్ట్ వినిపిస్తోంది. కేసీఆర్ వదిలేసిన టీఆర్ఎస్ పేరు కలిసి వచ్చేలా కవిత తన నూతన రాజకీయ మార్గానికి బాటలు వేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో పాత ఉద్యమ పార్టీ పేరుతో కొత్త రాజకీయ అజెండాతో కవిత చేయబోతో పాలిటిక్స్ రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలు దారి తీస్తుందో అనే ఉత్కంఠ నెలకొంది.

బీఆర్ఎస్‌కు బిగ్ షాక్? జరుగుతున్న ప్రచారం ప్రకారం టీఆర్ఎస్ పేరుతో కవిత పార్టీని స్థాపిస్తే ఇది బీఆర్ఎస్‌ను భారీగా దెబ్బ తీసే అవకాశం ఉండనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్‌లో ఉన్న అసంతృప్త నేతలంతా కవిత టీమ్ లోకి చేరే అవకాశం ఉందని తెలుస్తోంది. బీఆర్ఎస్‌లో అవకాశాలు దక్కని వారంతా కవిత వెంట నడిస్తే అది గులాబీ పార్టీ ఓటు బ్యాంకుపై భారీగా ప్రభావం చూపే అవకాశం లేకపోలేదనే చర్చ జరుగుతోంది. ఇక కవితకు ఉద్యమ కాలం నాటి నుంటి యాక్టివ్ పాలిటిక్స్ సాగిస్తున్న కవిత రాబోయో రోజుల్లో ఎలాంటి వ్యూహాలతో రాబోతున్నారు? ఆమె రాకతో ఎవరికి డ్యామేజ్? మరెవరికి మైలేజ్ రాబోతోంది అనేది కాలమే సమాధానం చెప్పనుంది.

## ఏపీలో అమానుష ఘటన.. ఆరేళ్ల చిన్నారిపై 60 ఏళ్ల వృద్ధుడి అఘాయిత్యం

న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఏపీలో అమానుష ఘటన చోటుచేసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలంలోని ఓ మేజర్ పంచాయతీలో ఆరేళ్ల చిన్నారిపై 60 ఏళ్ల వృద్ధుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కిరాణ షాపునకు వచ్చిన బాలికపై అత్యాచారం చేశాడు.

ఈ ఘటనపై బాధిత చిన్నారి తల్లిదండ్రులు ఆచంట పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు చికిత్స, వైద్య పరీక్షల నిమిత్తం చిన్నారిని పాలకొల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## రైతులకు కేంద్రం తీపి కబురు.. సబ్సిడీకి మోడీ సర్కార్ గ్రీన్ సిగ్నల్



న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): దేశంలోని రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు పెరిగినా ఆ భారం రైతులపై పడకుండా కేంద్రమే భరించేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఖరీఫ్ సీజన్ లో పీ అండ్ కే ఎరువుల రాయితీకి కేంద్ర కేబినెట్ ఆమోద ముద్రవేసింది. బుధవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో సెంట్రల్ కెబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించిన మంత్రిమండలి నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ నిర్ణయాలను మంత్రి అశ్వనీకుమార్ వైష్ణవ్ మీడియాకు వెల్లడిస్తూ పీ అండ్ కే ఎరువులకు రూ. 41,543 కోట్ల రాయితీకి కేబినెట్ ఆమోద ముద్రవేసిందని పేర్కొన్నారు. అలాగే రూ. 13 వేల కోట్లతోయ జపుర మెట్రో ప్రాజెక్టు రెండో దశకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించారు.

రాజస్థాన్‌లో భారీ రిఫైనరీ: భారతదేశ ఇంధన రంగంలో మరో కీలక మైలురాయిగా నిలవనున్న రాజస్థాన్ రిఫైనరీ ప్రాజెక్టుపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. హెచ్‌పీసీఎల్ రాజస్థాన్ రిఫైనరీ లిమిటెడ్ ప్రాజెక్టుకు సంబంధించిన ఈక్విటీ భాగస్వామ్యం మరియు ప్రాజెక్టు వ్యయ సవరణలపై స్పష్టతనిచ్చారు.ఈ రిఫైనరీలో వాణిజ్య కార్యకలాపాలు జూలై 2026 నుండి కార్యాకలాపాలు ప్రారంభించబోతున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద రిఫైనర్‌గా అవతరించిందని మన ప్రస్తుత రిఫైనింగ్ సామర్థ్యం ఏడాదికి 258 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా అదనంగా మరో 9 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.

## కాళేశ్వరం కమిషన్ పై తీర్పు వాయిదా

మొదటి పేజీ తరువాయి

తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది ధర్మాసనం. కాళేశ్వరం కమిషన్ నివేదికపై గతంలోనే కేసీఆర్, హరీష్ రావు, ఐఏఎస్ స్మితా సభర్వాల్, మాజీ సీఎస్ జోషి సవాల్ చేసిన విషయం తెలిసిందే. కొన్నినెలలుగా ఈ పిటిషన్లపై వాదనలు జరిగాయి. మార్చి 12న దీనిపై వాదనలు పూర్తవ్వగా కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. కానీ.. అనుహ్యంగా జడ్జి తుదితీర్పును ఏప్రిల్ 22కు వాయిదా వేశారు.

కమిషన్ నివేదికను కొట్టివేయాలని, అందులో ఉన్నవంతా అవాస్తవమన్నారు. రాజకీయకక్షలో భాగంగానే ఈ కమిషన్ ను వేశారని ఆరోపించారు. కాగా.. ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకే కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ ను వేశామని ప్రభుత్వం తెలిపింది. కాగా.. వాదనల సమయంలో కేసీఆర్ తరపు అడ్వకేట్.. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ నిబంధనలను ఉల్లంఘించారని కోర్టుకు తెలిపారు. 8(బి), 8(సి) నోటీసులు ఇవ్వలేదని, ఎక్కడా విట్నెస్ తో క్రాస్ ఎగ్జామినేషన్ జరగలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని ఎలాంటి ఎంక్వైరీ లేకుండానే ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

## గుడ్‌న్యూస్.. వడ్డీరేట్లపై ఆర్బీఐ కీలక ప్రకటన

మొదటి పేజీ తరువాయి

అనంతరం ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. రెపో రేటును 5.25 శాతం వద్దే ఉంచుతున్నట్లు తెలిపారు. అలాగే పాలసీ విధానం కూడా స్థిరంగానే కొనసాగుతుందని వెల్లడించారు. అంటే వడ్డీ రేట్లలో ప్రస్తుతానికి ఎలాంటి మార్పు లేదు. దీనివల్ల బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న వారి ఈఎంఐలలో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు.

దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలపై కూడా ఆర్‌బీఐ ఒక అంచనాకు వచ్చింది. ఈ ఏడాది భారత దేశం 6.9 శాతం జీడీపీ వృద్ధి సాధిస్తుందని గవర్నర్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే నాలుగు త్రైమాసికాల్లో కూడా దేశ వృద్ధి రేటు 6.7 శాతం నుండి 7.2 శాతం మధ్యలో నిలకడగా కొనసాగుతుందని వివరించారు. మొదటి త్రైమాసికం (క్యు1): 6.8 శాతం, రెండవ త్రైమాసికం (క్యు2): 6.7 శాతం, మూడవ త్రైమాసికం (క్యు3): 7 శాతం, నాల్గవ త్రైమాసికం (క్యు4): 7.2 శాతం ఉంటుందని తెలిపారు.

ఎస్‌టీఎఫ్ రేటు 5 శాతంగా, అలాగే ఎంఎస్ఎఫ్ మరియు బ్యాంక్ రేట్లు 5.5 శాతం వద్దే స్థిరంగా ఉంటాయని గవర్నర్ మల్హోత్రా స్పష్టం చేశారు. అయితే, ప్రపంచ దేశాల్లో నెలకొన్న అస్థిర పరిస్థితుల మధ్య ఆర్‌బీఐ ఈ నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా పశ్చిమ ఆసియాలో గొడవలు, అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధ వాతావరణం వల్ల చమురు సరఫరా చేసే హోర్ముజ్ జలసంధి దగ్గర సమస్యలు మొదలయ్యాయి. ఈ యుద్ధ ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. ప్రస్తుతం రెండు వారాల పాటు యుద్ధానికి బ్రేక్ పడి కొంత ఊరట లభించినప్పటికీ, పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు భారత ఆర్థిక వ్యవస్థపై భారాన్ని పెంచుతున్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో దేశ ఆర్థిక పరిస్థితి దెబ్బతినకుండా ఆర్‌బీఐ ఆచితూచి అడుగులు వేస్తోందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు.

## నల్లజర్ల పీహెచ్‌సీలో భారీ అగ్నిప్రమాదం..

మొదటి పేజీ తరువాయి

ఈ అగ్నిప్రమాద ఘటనతో పీహెచ్‌సీలో ఉన్న పేషంట్లు, బంధువులు భయభ్రాంతులకు గురయ్యారు. పోలీసులు విచారణ చేయగా.. విద్యుత్ షార్ట్ సర్క్యూటే అగ్నిప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారణ అయింది. కాగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పేషంట్లకు మరో ఆస్పత్రి నుంచి మందులు తెప్పిస్తామని వైద్యాధికారి వెల్లడించారు.

## ఉల్లిపాయలు కొనడానికి వెళ్తే.. స్కూటీ డిక్కీలోని రూ.5 లక్షలు మాయం

న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఓ రైతు తన ఆర్థిక అవసరాల కోసం అప్పు తెచ్చుకున్న నగదును భద్రంగా స్కూటీ డిక్కీలో పెట్టుకున్నాడు. ఉల్లిపాయలు కొనడానికి షాప్ ముందు స్కూటీని ఉంచి వెళ్లిన కాసేపటికి ఆ నగదు మాయమైంది. పల్నాడు జిల్లా జొన్నలగడ్డ బైపాస్ రోడ్డు వద్ద జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట సత్యనారాయణ అనే రైతు తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం రూ.5 లక్షల నగదును అప్పుగా తెచ్చుకున్నాడు. ఆ డబ్బును బ్యాగులో పెట్టి, స్కూటీ డిక్కీలో భద్రపరిచాడు.

జొన్నలగడ్డ బైపాస్ రోడ్డు సమీపంలో ఉల్లిపాయలు కొనుగోలు చేసేందుకు రైతు తన స్కూటీని రోడ్డు పక్కన ఆపి వెళ్లాడు. కేవలం కొద్ది నిమిషాల వ్యవధిలోనే తిరిగి వచ్చి చూసేసరికి స్కూటీ డిక్కీ తెరిచి ఉంది. లోపల ఉన్న రూ.5 లక్షల నగదు బ్యాగ్ కనిపించకుండా పోయింది. దీంతో ఆందోళనకు గురైన రైతు చుట్టుపక్కల వారిని విచారించినా ఫలితం లేకపోయింది. గుర్తు తెలియని వ్యక్తి డిక్కీ తెరిచి నగదును దోచుకెళ్లినట్లు నిర్ధారణ అయింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మీ రాజకీయాల కోసం ప్రాజెక్టులతో చెలగాటం ఆడొద్దు.. మంత్రి ఉత్తమ్‌కు హరీశ్ రావు లేఖ

మొదటి పేజీ తరువాయి

వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులను ఇలా నిర్లక్ష్యంగా వాడటం శోచనీయం అని చందలాపూర్ సహా ప్యాకేజీ 6, 8, 10, 11, 12 లలో మోటార్ల ఆపరేషన్ తీరు తీవ్ర అభ్యంతరకరం అన్నారు. తక్షణమే మోటార్లను పదే పదే ఆన్, ఆఫ్ చేసే అశాస్త్రీయ విధానాన్ని ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం, డిజైన్ కు అనుగుణంగా నిరంతరాయంగా పంపులు నడిపించాలని మీ రాజకీయాల కోసం తెలంగాణ రైతుల జీవనాడి అయిన ప్రాజెక్టులతో చెలగాటం ఆడొద్దని హరీష్ రావు హెచ్చరించారు.

## ప్రపంచశాంతికి గొప్పరోజు.. పశ్చిమాసియాలో సువర్ణోధ్యాయం : ట్రంప్



న్యూస్ డెస్క్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఇరాన్ పై రెండువారాలపాటు కాల్పుల విరమణకు ఒప్పుకోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. ప్రపంచశాంతికి ఇది గొప్పరోజని మీడియా సమావేశంలో తెలిపారు. అలాగే పశ్చిమ ఆసియాలో ఇదొక సువర్ణోధ్యాయం కాబోతోందన్నారు. ఇరాన్ కు ఇక చాలు అని అనిపించిందని.. యుద్ధం పేరు ప్రస్తావించకుండా పేర్కొన్నారు. ఇక ఇరాన్ టెహ్రాన్ నిర్మాణాన్ని ప్రారంభించుకోవచ్చన్నారు. హోర్ముజ్ జలసంధి రీఓపెన్ కోసం ప్రపంచదేశాలన్నీ ఎదురుచూస్తున్న క్రమంలో.. తాము ఈ నిర్ణయం తీసుకున్నామని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఆ జలసంధి మీదుగా అన్ని రవాణాలు సజావుగా జరిగేందుకు అమెరికా బలగాలు ఉంటాయన్నారు. అన్నీ సవ్యంగా జరిగేందుకు అమెరికా మద్దతు పూర్తిగా ఉంటుందన్నారు. ఇరాన్ కు మున్ముందు మంచిరోజులు ఉన్నాయని తెలిపారు. ఈ కాల్పుల విరమణ ఒప్పందం వెనుక చైనా హస్తం కూడా ఉందా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. ఆ విషయం తన దృష్టికి కూడా వచ్చిందని, అది నిజమేనని అనుకుంటున్నట్లుగా చెప్పారు.

# తెలంగాణ గడ్డపై కొత్త రాజకీయం

## ఈనెల 25న కవిత కొత్త పార్టీ ఆవిర్భావం!



మోత్కూర్ , 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో మరొక రాజకీయ పార్టీ ఉద్యమానికి నాంది పలుకుతూ ఈనెల 25వ తేదీన పురుడు పోసుకుంటుందని యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ జాగృతి యువ నాయకులు సకినాల వివేక్ పటేల్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో సబ్బండ వర్గాల అభివృద్ధి సామాజిక న్యాయమే లక్ష్యంగా తెలంగాణ అస్తిత్వంలో ఈ పార్టీ పురుడు పోసుకోనుందని అన్నారు. తెలంగాణ ప్రజా గొంతుక కవితక్క నాయకత్వంలో ఈ పార్టీ ప్రజల మద్దతుతో తిరుగులేని శక్తిగా ఎదగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రతిపక్షాలు అన్ని కుమ్మక్కయ్యాయని ప్రస్తుతం ఈ ప్రభుత్వంపై కవితక్క మాత్రమే ఒంటరి పోరాటం చేస్తుందని మహిళల చేతులలో రాష్ట్ర భవిష్యత్తు ఉందని కేవలం ఇది ఒక రాజకీయ పార్టీ కాదని ఇదొక మార్పు అని ఇన్నాళ్లు అవకాశం ఇవ్వలేదు అనే రోజులు పోయాయని ఇకపై అవకాశం తీసుకుంటాము అని గర్జించే సమయం ఆసన్నమైందని సకినాల వివేక్ అన్నారు. ఇంటి బాధ్యతను మోసే ఆడబిడ్డ రాష్ట్రాన్ని కూడా అదే నిబద్ధతతో నడిపించగలరని ఒక ఆడబిడ్డ ముందుకు కదిలితే రాష్ట్రం రూపురేఖలే మారిపోతాయని ఇది వేలాదిమంది మహిళల చేతుల్లో మొదలవుతున్న నూతన రాజకీయ పార్టీ అని ఈనెల 25వ తేదీన శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్ లోని అద్వయ్య కన్వెన్షన్ లో జరిగే నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావానికి పెద్ద ఎత్తున కదలి వచ్చి కవితక్క నాయకత్వాన్ని బలపరచాలని సకినాల వివేక్ పటేల్ కోరారు.

# ప్రమాదకరంగా ఉన్న కరెంట్ వైర్లను వెంటనే సరిచేయ్యాలి

## -బొల్లు యాదగిరి జిల్లా కమిటీ సభ్యులు



మోత్కూర్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): మోత్కూర్ మండలం రాగిబావి గ్రామంలో ప్రమాదకరంగా వేలాడుతున్న కరెంట్ వైర్లను వెంటనే సరిచేయ్యాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి కోరారు. బుధవారం రోజున పార్టీ పిలుపు మేరకు సమస్యలపై పోరుబాటలో భాగంగా రాగిభావి గ్రామంలో సమస్యలను పరిశీలించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ..... దత్తప్పగూడెం నుండి రాగిభావికి వెళ్లే దారికి పక్కన మరియు రాగిబావి నుండి ముషీపట్ల గ్రామానికి వెళ్లే దారికి పక్కన మనుషులకు తాకే విధంగా ప్రమాధకరంగా ఉన్న కరెంట్ వైర్లను వెంటనే సరిచేయ్యాలని లేకుంటే జరిగే ప్రమాధాలకు సంబందించిన అధికారులే బాధ్యత వహించవలసి వస్తుందని అన్నారు. గ్రామంలో గ్రామ పంచాయితీ భవనం నిర్మాణం చెయ్యాలని, అన్ని వార్డులలో మురికి కాల్వలు, ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి నిధులను ప్రభుత్వం వివక్షత చూపించకుండా మంజూరు చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, పానుగుల రమేష్, ఎన్నం వెంకట్ రెడ్డి, మెండు శేఖర్ రెడ్డి, పిట్టల చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలు, బాలింతలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

## మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం స్వప్న



మోత్కూర్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నేడు పట్టణంలోని 11 మరియు 12వ వార్డులలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మాతా–శిశు సంరక్షణే ధ్యేయంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి గడ్డం స్వప్న సోమా నర్సయ్య గారు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, వైద్యులు సూచించిన పోషకాహారం మరియు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు: ఈ కార్యక్రమంలో 11, 12 వార్డుల కౌన్సిలర్లు కారాపోతుల వెంకన్న, మెంట రమణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పల్లెర్ల వెంకన్న, డాక్టర్ హేమంత్, వైద్య సిబ్బంది మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు. శిబిరానికి వచ్చిన గర్భిణీలకు, బాలింతలకు డాక్టర్ హేమంత్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

## బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



కుత్బుల్లాపూర్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): గాజుల రామారం 125 డివిజన్ కైసర్ నగర్ బస్తీతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం లలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా కైసర్ నగర్లో నూతనంగా నిర్మించిన రోడ్డును పరిశీలించడంతో పాటు స్థానికంగా నెలకొన్న మురుగునీటి అవుట్ లేట్ సమస్యతో పాటు మంచినీటి సరఫరా లాంటి సమస్యలను స్థానికులు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాల లబ్ధిదారులు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, కైసర్ నగర్తో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలలో పర్యటించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ. ప్రైవేట్ అపార్ట్మెంట్లకు దీటుగా సకల సౌకర్యాలను కల్పిస్తూ నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చిన మహోన్నత నాయకులు బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలలోని మౌలిక వసతుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని అందులో భాగంగా ఇప్పటికే సేవరేజ్ మేనేజ్మెంట్ సమస్యతో పాటు వీధి దీపాల నిర్వహణ సమస్యను పరిష్కరించామని, రానున్న రోజుల్లో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలలోని సమస్యల పరిష్కారానికి చేస్తానన్నారు. మురుగునీటి అవుట్ లేట్ సమస్యతో పాటు మంచినీటి సమస్య పరిష్కారం కోసం ప్రణాళికలు రూపొందించి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గతంలో మన బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కైసర్ నగర్ బాచుపల్లి లింక్ రోడ్డును ఏర్పాటు చేయడంతో పాటు కైసర్ నగర్ బస్తిని అభివృద్ధి పరిచామని, అభివృద్ధిలో భాగంగా నేడు కైసర్ నగర్ బస్తీ రోడ్డును నిర్మించి అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కైసర్ నగర్ తో పాటు కుత్బుల్లాపూర్ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారులు, 2 బిహెచ్కె డిగ్నిటీ హౌసింగ్ సొసైటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సాదుల వేణు, ముఖ్య సలహాదారులు షేక్ సాజిద్ చౌష్, ఎండి.ఆతిక్ రెహ్మాన్, బ్రహ్మానాయుడు, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి సయ్యద్ షఫీ, కోశాధికారి ఎస్. ఏ.ఖయుమ్, స్థానిక నాయకులు పరుశ శ్రీనివాస్ యాదవ్, విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజు , అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, చెట్ల వెంకటేష్, బోయిని మహేష్, చిన్నా చౌదరి, తారా సింగ్, సాయిబాబా, మామి, అజయ్ గుప్తా, నయీమ్, మసూద్, నవీన్, తురియా నాయక్, కిషోర్ యాదవ్, ఉపేందర్ రెడ్డి, సురేష్, చిన్నా బాబు, నగేష్, చిన్నా, సయ్యద్ రంజాన్, ప్రసాద్, శివా నాయక్, ఆసిఫ్, గౌస్, పలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో దొంగలు పట్టుకోవడం లో ప్రభుత్వం విఫలం

## పేరుకే సీ.సీ కెమెరాలు పట్టించుకోని అధికారులు

## ఖమ్మం బి.జె.పి టూ టౌన్ అధ్యక్షులు ధనియాకుల వెంకటనారాయణ




ఖమ్మం, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయని, దొంగలను పట్టుకోవడంలో అటు అధికారులు, ఇటు పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమైందని,ఖమ్మం బిజెపి టూ టౌన్ అధ్యక్షులు ధనియాకుల వెంకటనారాయణ ఆరోపించారు. బుధవారం వాహనాలు చోరీకి గురవుతున్న విషయం తెలుసుకొని, ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనారోగ్య కారణాలవల్ల వివిధ ప్రాంతాల నుండి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి వాహనాలు ద్వారా వచ్చేవారికి దొంగలు చుక్కలు నరకం చూపిస్తున్నారని, రోగి సహాయకులు, రోగిని చూసేందుకు వచ్చిన బంధువులు వారి వాహనాలను ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్ చేస్తుంటారు. రోగులు వారి బాధల్లో వారు ఉంటే ఇదే అదునుగా భావించి కొందరు దొంగలు రెక్కీ నిర్వహించి వాహనాలకు హ్యాండిల్ లాక్ వేసినప్పటికీ. బైక్ లను దొంగిలించడం పరిపాటిగా మారింది. గతంలో సైతం బైకులు పోయిన ఘటనలు ఉన్నప్పటికీ ఇటు వైద్యాధికారులు, అటు పోలీసు అధికారులు ఎలాంటి భద్రత చర్యలు చేపట్టకపోవడం బాధాకరం అన్నారు.ఆసుపత్రి ఆవరణలో సీ.సీ కెమెరాలు ఉన్నప్పటికీ కేవలం కెమెరాలు చూసేందుకు తప్ప ఎక్కడ పనిచేయకపోవడం తో ఇదంతా కూడా ఆసుపత్రి వర్గాలకు సంబంధించి చోరీలు జరుగుతున్నాయనే ఆరోపణలు లేకపోలేదన్నారు. ఎందుకంటే ఆసుపత్రి ఆవరణలో ఎక్కడ సీ.సీ కెమెరాలు పనిచేయడం లేదనే విషయం ఆసుపత్రి వర్గాలకు తప్ప మరెవరికి తెలిసే విషయం లేదు. గతంలో టోకెన్ ఇచ్చి వచ్చే వారికి ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చేసేవారు, కానీ వాహనాల పార్కింగ్ ను ఓ కాంట్రాక్టర్ లీజు తీసుకొని నడిపిస్తున్న క్రమంలో సోమవారం ఒక్కరోజే మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగులు, జర్నలిస్ట్ ల వాహనాలకే దిక్కు లేకుంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటి అంటూ ఆయన ప్రశ్నించారు. అనారోగ్య కారణాలతో ఆసుపత్రికి వస్తున్న సామాన్యుల వాహనాలకు భద్రత లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి రావాలంటే జంకుతున్నారని, అసలే అనారోగ్యాలు ఆపై వాహనాలు చోరీకి గురవడంతో ఇక ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో సామాన్యులు అల్లాడుతున్నారన్నారు. ఇప్పటికైనా అటు పోలీస్ యంత్రాంగం, ఆసుపత్రి వర్గాలు సరైన చర్యలు చేపట్టి సామాన్యుల వాహనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరుతున్నారు. లేని యెడల ఆందోళన చేస్తామని, హెచ్చరించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రిలో నిఘా ఏర్పాటు చేయకపోవడం సిగ్గు చెటని, ఇప్పటికే ఎంతో మంది సామాన్యుల వాహనాలు పోయి ఇబ్బంది పడుతున్నారాన్నారు. అసలు ఆసుపత్రి వర్గాలు ఎం చేస్తున్నారని, ఆయన ప్రశ్నించారు. అధికారులు ఇటు మంత్రులు దృష్టి సారించకపోవడంతోనే వాహన చోదకులు పెరిగిపోతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటుచేసి ఆసుపత్రికి వస్తున్న వారి వాహనాలను కాపాడాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమం లో తాజనూత భద్రం, రుద్ర గాని మాధవ్, పాశం శ్రీనివాసరెడ్డి, ఈశ్వర ప్రగడ లలిత, దాసరి వీరభద్రం, ఇనుగుర్తి ఉపేంద్ర, శ్రీజర్ల వెంకట్ ఉన్నారు.


# ఐలాపూర్ లోని 1 నుంచి 220 సర్వే నంబర్లలోని 1265 ఎకరాల భూమిలో జరుగుతున్న వివాదంలో పేద రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదు

## ఎంఆర్ పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



పటాన్ చెరు, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): సంగారెడ్డి జిల్లా ఐలాపూర్ గ్రామంలోని వివాదంలో ఉన్న భూముల రైతులను ఎంఆర్ పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ , హైకోర్టు అడ్వకేట్ ముఖీం పరామర్శించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మీడియాతో మాట్లాడారు. ఐలాపూర్ లోని 1 నుంచి 220 సర్వే నంబర్లలోని 1265 ఎకరాల భూమిలో జరుగుతున్న వివాదంలో పేద రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివాదాస్పద భూములతో సంబంధం లేని రైతులను భయబ్రాంతులకు గురిచేయటం దారుణమన్నారు. కోర్టు పరిదిలో ఉన్న కేసులకు అంతిమ నిర్ణయం వచ్చేంతవరకు హైడ్రా అధికారులు సంయమనం పాటించాలన్నారు. ఐలాపూర్ 1 నుంచి 220 సర్వే నెంబర్లనలో ఇనామ్, ప్రభుత్వ భూములలో విచారణకు, వివాదానికి సంబంధించిన భూములు ఉన్నాయని, కోర్టు పరిధిలో లేని భూములకు సంబంధించిన రైతుల జోలికి హైడ్రా, రెవెన్యూ వారు వచ్చి ఇబ్బంది పెట్టరాదన్నారు. రైతులకు ఉన్న లీగల్ హక్కులకు భంగం వాటిల్లితే సహించమన్నారు. ఏదైనా కోర్టు పరిధిలో పెండింగ్లో ఉన్న కేసు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా దృష్టి పెడితే ఏ సమస్య ఉండదన్నారు. హైడ్రా ఏ నిభందనల పరిదిలో పనిచేయాలో వాటికి అతిక్రమించటం జరుగుతుందన్నారు. హైడ్రా తన పరిధిలో పనిచేస్తుందా, అతిక్రమిస్తుందా అనే అంశంపై ఒకసారి ముఖ్యమంత్రి పరిశీలించాలని సూచించారు. హైడ్రాకు ఒక పరిధి ఉందని, దానికి కొన్ని నిబందనలు ఉన్నాయని, వాటి పరిదిలో ఒక స్పెషల్ కోర్టు ఏర్పాటు చేస్తే భూసమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయన్నారు. కొన్ని కేసులను విచారించటానికి ప్రత్యేక కోర్టులు ఉన్నట్లు హైడ్రా కు ఒక కోర్టు ఏర్పాటు చేయాలని సూచించారు. హైడ్రా పరిధిలో భూ వివాదాలు పరిష్కారానికి ప్రత్యేక కోర్టు అవసరం ఉందని, హైడ్రా అనవసర జోక్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం ఉందనే అనుమానాలున్నాయని వాపోయారు.

## ఒకసారి ఎమ్మెల్యే అయితే బీపీ, మళ్లీ ఎమ్మెల్యే అయితే షుగర్ వచ్చాయ్ : రోజా



ఏపీ న్యూస్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత తను ఎదుర్కొన్న ఆరోగ్య సవాళ్లు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఇంటరెస్టింగ్ కామెంట్స్ చేశారు. ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న వైసీపీ సర్పంచ్‌లను రోజా నగరిలోని తన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలు అంటేనే మానసిక ఒత్తిడితో కూడుకున్నవని పేర్కొన్నారు.

తాను మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు బీపీ సమస్య వచ్చిందని, రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత షుగర్ బారిన పడ్డానని ఆమె తన వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితిని గురించి రోజా వెల్లడించారు. గత వైసీపీ పాలనలో జగన్ నేతృత్వంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించామని, ప్రజల మధ్య ఉంటూ సమస్యలు పరిష్కరించడం తమ పార్టీ సంస్కృతి అని చెప్పారు.

ఎన్నికల సమయంలో కూటమి నేతల్లా తాము అబద్ధాలు చెప్పలేకపోయామని, అందుకే ఓటమి పాలయ్యామని రోజా అన్నారు. వైసీపీ సర్పంచ్‌లు గర్వంగా ప్రజల్లో తిరిగేలా పనులు చేశారని మెచ్చుకున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ పార్టీ సత్తా ఏంటో చాటాలని పిలుపునిచ్చారు. అబద్ధాలతో గెలిచిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు.

## ఇంద్రకీలాద్రిపై కలకలం.. నకిలీ పత్రాలతో అర్చక ఉద్యోగానికి యత్నం!



ఏపీ న్యూస్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): విజయవాడలోని ప్రసిద్ధ కనకదుర్గమ్మ ఆలయంలో నకిలీ పత్రాల సృష్టించి అర్చక ఉద్యోగం పొందేందుకు జరిగిన ఒక కుట్ర వెలుగులోకి వచ్చింది. దేవాదాయ శాఖ అధికారుల కళ్లు గప్పి, ఏకంగా అపాయింట్మెంట్ ఆర్డర్ తెచ్చుకున్న ఒక వ్యక్తి ఉదంతం ఇప్పుడు ఇంద్రకీలాద్రిపై సంచలనంగా మారింది.

ఘటన సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. 2022లో సాయిబాబు అనే అర్చకుడు మరణించారు. ఆయన మరణానంతరం ఆ ఖాళీ అయిన అర్చక పోస్టును దక్కించుకోవాలని దిలీప్ దత్తార అనే వ్యక్తి పన్నాగం పన్నాడు. తాను సాయిబాబు దత్తపుత్రుడినని నమ్మించేలా నకిలీ పత్రాలను సృష్టించి, దేవాలయ అధికారులను బోల్తా కొట్టించాడు. ఈ పత్రాల ఆధారంగా ఏకంగా దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుండి నియామక ఉత్తర్వులు కూడా పొందడం గమనార్హం.

దిలీప్ ఇలాంటి మోసానికి పాల్పడటం ఇది మొదటిసారి కాదు. 2009లో నామయ్య అనే అర్చకుడు మరణించినప్పుడు కూడా, ఆయన స్థానంలో ఉద్యోగం పొందేందుకు దిలీప్ ప్రయత్నించాడు. అయితే, తాజాగా సాయిబాబు మరణం తర్వాత మరోసారి నకిలీ పత్రాలతో రంగంలోకి దిగి అధికారులను పక్కదారి పట్టించాడు. దిలీప్ చేస్తున్న ఈ మోసాన్ని గమనించిన అతని సొంత పెదనాన్న కుమార్తె (2009లో చనిపోయిన నామయ్య పెద్ద కుమార్తె) కోడూరు లక్ష్మీ పద్మావతి ఆలయ ఈవో శీనా నాయక్‌కు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. నిందితుడు తప్పుడు పత్రాలతో అధికారులను మోసం చేస్తున్నాడని ఆమె ఆధారాలతో సహా వివరించారు. దీంతో అప్రమత్తమైన ఈవో, ఆ నియామక ప్రక్రియను వెంటనే నిలిపివేసి విచారణకు ఆదేశించారు.

దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో డాక్యుమెంట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ఎంత నిర్లక్ష్యంగా సాగుతుందో ఈ ఘటన స్పష్టం చేస్తోంది. కనీస విచారణ లేకుండా నకిలీ పత్రాలకు అపాయింట్మెంట్ ఆర్డర్ ఎలా ఇచ్చారనే దానిపై తోటి అర్చకులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు లోతుగా విచారణ జరిపి, ఈ కుట్రలో ఎవరి పాత్ర ఉందో తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై దేవాదాయ శాఖ విచారణ కొనసాగుతోంది.

## కరుడు గట్టిన ముగ్గురు దొంగలపై పీడీ యాక్ట్




ఏపీ న్యూస్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): పదే పదే దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలపై పిడి యాక్ట్ ప్రయోగించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పిడి యాక్ట్ నమోదైన వారిలో కావటి అరుణపై కడపతో పాటు ఇతర జిల్లాల్లో 16 కేసులు, తొండ పోసమ్మపై కడప, ఇతర జిల్లాల్లో 27 కేసులు ఉండగా తొండ పోతురాజుపై కడపతో పాటు ఇతర జిల్లాల్లో 56 కేసులు ఉన్నట్లు ఆయన చెప్పారు. పులివెందుల మండలం నగిరిగుట్ట మంగళ వీధికి చెందిన కావటి అరుణ, తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం టి నగర్‌కు చెందిన చెందిన తొండ పోసమ్మ , ఇదే గ్రామానికి చెందిన తొండ పోతురాజు అలియాస్ పోతురాజు ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ముగ్గురు దొంగలపై పౌర భద్రతకు ముప్పు వాటిల్లకుండా నిర్బంధించే విషయమై తగు ఉత్తర్వు జారీ చేయడమైందని ఎస్పీ స్పష్టం చేశారు.

## వచ్చే సంవత్సరం నా పాదయాత్ర..

### ఇక, చంద్రబాబుకి ప్రతిరోజూ సినిమా చూపిస్తాం..!




ఏపీ న్యూస్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి హాట్ కామెంట్స్ చేశారు.. వచ్చే సంవత్సరం తాను పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. ప్రజలతో నేరుగా మమేకం అవుతూ వారి సమస్యలను తెలుసుకుంటానని తెలిపారు. పాదయాత్ర ప్రారంభమైన తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రతిరోజూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు "సినిమా చూపిస్తాయి" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను ప్రస్తుత ప్రభుత్వం ఆపివేసిందని జగన్ ఆరోపించారు. ప్రజల తరఫున వైసీపీ శ్రేణులు గట్టిగా పోరాటం చేస్తున్నాయని, వారి కృషిపై గర్వంగా ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలో ఇప్పటికే ఐదేళ్ల కాలంలో సగం గడిచిపోయిందని, అయినప్పటికీ రాజధాని అంశంలో స్పష్టమైన పరిష్కారం చూపలేకపోయారని విమర్శించారు.

అమరావతి పేరుతో రైతులను, ప్రజలను మోసం చేస్తున్నారని జగన్ ఆరోపించారు. అమరావతిలో ఒక ఎకరానికి కనీస సదుపాయాలకే రూ.2 కోట్లు ఖర్చవుతుందని, మొదటి 50 వేల ఎకరాలకే రూ.1 లక్ష కోట్లు అవసరమవుతాయని అన్నారు. మరిన్ని ఎకరాలు అభివృద్ధి చేయాలంటే మొత్తం ఖర్చు లక్షల కోట్లకు చేరుతుందని తెలిపారు. ఇంత భారీ వ్యయంతో రాజధాని నిర్మాణం సాధ్యమా అనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. రాష్ట్ర అభివృద్ధికి తాము ప్రత్యామ్నాయ ప్రణాళికలను సూచించామని జగన్ వివరించారు. ప్లాన్-A కింద విశాఖపట్నాన్ని కార్యనిర్వాహక రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా, అమరావతిని శాసన రాజధానిగా ప్రతిపాదించామని గుర్తు చేశారు. ప్లాన్-బీ కింద మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు మధ్య ప్రాంతాన్ని మావిగన్ గ్రోత్ కారిడార్‌గా అభివృద్ధి చేయాలని సూచించామని తెలిపారు.

అమరావతిలో నిర్మించాల్సిన భవనాలను ఈ గ్రోత్ కారిడార్‌లో నిర్మిస్తే తక్కువ ఖర్చుతో, వేగంగా రాజధాని అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. మొత్తం రూ.2 లక్షల కోట్ల భారాన్ని రాష్ట్రంపై వేయకుండా, దాని 10 శాతం ఖర్చుతోనే అద్భుతమైన రాజధాని నిర్మించవచ్చని జగన్ అభిప్రాయపడ్డారు. అయితే, ఈ ప్రత్యామ్నాయాలను పక్కనబెట్టి చంద్రబాబు అమరావతిపైనే పట్టుబడుతున్నారని విమర్శించారు. దీనికి కారణం అమరావతి పేరుతో కాంట్రాక్టులు, కమిషన్లు సంపాదించడమేనని ఆరోపించారు. అమరావతి దోపిడీ, అవినీతికి కేంద్రంగా మారిందని జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## విజయవాడ టెర్రర్ లింక్ లో హైదరాబాదీ సైదా బేగం..

### విచారణ లో సంచలన విషయాలు వెలుగులోకి



ఏపీ న్యూస్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): విజయవాడ టెర్రర్ లింక్ లో హైదరాబాదీ సైదా బేగం విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. మహిళలను ఉగ్రవాదం వైపు ఆకర్షించేలా సైదా బేగం బాధ్యత తీసుకున్నట్లు గుర్తించారు. మహిళలను రిక్రూట్ చేసుకునేలా సైదా బేగం కు ఉగ్రవాదుల టార్గెట్ ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది. ఇప్పటి వరకు 42 మంది అమ్మాయిలను సైదా రిక్రూట్ చేసినట్టు అధికారులు గుర్తించారు.

అమ్మాయిలకు స్నిప్పర్ రైఫిల్, షూటింగ్ వంటి వాటిలో ట్రైన్ చేయాలని టెర్రరిస్టులు అదేశాలు ఇచ్చినట్లు తేలింది.

ఖావతీన్ పేరుతో స్పెషల్ వాట్సాప్ గ్రూప్ మెయింటైన్ చేసిన సైదా బేగం.. మరింత ఎక్కువగా యూత్ ను ఇస్లాం వైపు ఆకర్షితులను చేసి నెట్వర్క్ పెంచాలని జిహాదీ గ్రూప్స్ నుండి ఆదేశాలు వచ్చినట్లు నిర్ధారణ అయినట్లు తెలిపారు. ఇందులో ఒసామా బిన్ లాడెన్, జకీర్ నాయక్ వీడియోలు షేర్ చేస్తూ అమ్మాయిలను ఉగ్రవాదం వైపు మల్లించింది సైదా బేగం. ఇన్ స్టాగ్రామ్ లో 40 అకౌంట్ లు తెరిచి జిహాదీ వీడియోలు పోస్ట్ చేస్తూ యూత్ లో ఐడియాలజీ నింపింది.

మదర్సాల్లో మతపరమైన శిక్షణ అయ్యాక వెపన్ ట్రైనింగ్ కు సన్నాహాలు చేసినట్లు వెల్లడైంది. వాట్సాప్, ఇన్స్టా అకౌంట్ ల్లో కుప్పల కొద్ది pdf ఫైల్స్ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. బ్లాక్ పౌడర్ మేకింగ్, పేలుడు పదార్థాల తయారీ వంటి వీడియోలు ఉన్నట్టు గుర్తించారు. వీటిని ట్రైనింగ్, రిక్రూట్‌మెంట్‌కు సంబంధించినవిగా గుర్తించారు. ప్రస్తుతం ఉగ్రవాద లింకులపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా ఉగ్రవాద నెట్‌వర్క్‌లో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## నెల్లూరులో భారీగా వడగండ్ల వాన



ఏపీ న్యూస్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): కొద్ది రోజులుగా భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నెల్లూరు నియోజకవర్గ ప్రజలకు వాతావరణం ఒక్కసారిగా చల్లబడి భారీ ఊరటనిచ్చింది. వేసవి తాపంతో అల్లాడుతున్న జనానికి ఉపశమనం కలిగిస్తూ ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా వెదురుకుప్పం మండలంలో వడగండ్ల వాన కురవడంతో స్థానికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. ఎండల ధాటికి ఇళ్లకే పరిమితమైన జనం, ఈ అకాల వర్షం తెచ్చిన చల్లదనంతో కాస్త సేదదీరారు.

## లూలు మాల్‌కు బిగ్ షాక్..

### భూకేటాయింపు రద్దు




ఏపీ న్యూస్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): విజయవాడలో లూలు మాల్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో భూకేటాయింపుల జరిపింది. అయితే ఈ కేటాయింపుల విషయంలో ప్రస్తుతం ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ కేటాయింపును సవాలు చేస్తూ దాఖలైన పిల్‌పై ఏపీ హైకోర్టు విచారణ జరిపింది. దీంతో సదరు భూమి కేటాయింపును రద్దు చేసుకుంటున్నట్లు కోర్టుకు ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు తీసుకున్న నిర్ణయాన్ని అధికారికంగా తెలియజేస్తూ, భూకేటాయింపుల రద్దుకు సంబంధించిన ఉత్తర్వులను త్వరలోనే జారీ చేస్తామని ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనానికి వివరించారు.

ప్రభుత్వ వివరణ నమోదు

ప్రభుత్వ వివరణను నమోదు చేసుకున్న హైకోర్టు ధర్మాసనం రద్దు ఉత్తర్వుల ప్రతిని సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. గత ప్రభుత్వ నిర్ణయాలపై ప్రస్తుత ప్రభుత్వం పునఃసమీక్ష చేసింది. మాల్ ఏర్పాటు కోసం కేటాయించిన స్థలాన్ని తిరిగి వెనక్కి తీసుకుంది. దీంతో ఈ వివాదానికి తెరపడినట్లైంది.

## మత్తులో హైవేపై కానిస్టేబుల్ హల్చల్..

### నిలదీసిన యువకుడు



ఏపీ న్యూస్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన రక్షక భటే మత్తులో తూగుతూ సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాడు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై మద్యం మత్తులో ఉన్న ఓ కానిస్టేబుల్ బైక్ నడుపుతూ రోడ్డుపై ఉన్న వేగ నియంత్రణ బారికేడ్లను బలంగా ఢీకొట్టాడు. అదృష్టవశాత్తూ ఆ సమయంలో వాహనాలు ఏవీ పక్కన లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నిబంధనలు అమలు చేయాల్సిన వారే ఇలా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నిలదీసిన ప్రయాణికుడు.. పోలీసుల మధ్య వాగ్వాదం

ప్రమాదం జరిగిన సమయంలో అదే మార్గంలో ప్రయాణిస్తున్న ఒక యువకుడు వెంటనే స్పందించి కానిస్టేబుల్ వాహనాన్ని అడ్డుకున్నాడు. కానిస్టేబుల్ దిగుతున్న క్రమంలో ఆయన విపరీతమైన మద్యం మత్తులో ఉండటాన్ని గమనించిన యువకుడు... "సమాజాన్ని బాగు చేయాల్సిన పోలీసులే ఇలా తాగి తందనాలాడితే ఎలా?" అంటూ ధ్వజమెత్తాడు. దీంతో కానిస్టేబుల్‌కు, యువకుడికి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. యూనిఫాంలో ఉండి ఇలాంటి పనులేంటని యువకుడు ప్రశ్నించడంతో అక్కడ ఉత్కంఠ నెలకొంది.

టెస్ట్ చేయాల్సిందేనని పట్టుబట్టిన యువత

సదరు కానిస్టేబుల్ మద్యం సేవించాడని గట్టిగా ఆరోపించిన యువకుడు, ఆయనకు వెంటనే బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించాలని పట్టుబట్టాడు. పోలీసులు ఒకరికి ఒకరు కొమ్ముకాచుకోకుండా, చట్టం ముందు అందరూ సమానమేనని నిరూపించాలని డిమాండ్ చేశాడు. ఈ తతంగమంతా వీడియో తీయడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఉన్నతాధికారులు స్పందించి సదరు కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## పార్టీ నేతలపై లోకేష్ సీరియస్..

### గ్రీవెన్స్ నిర్వహించాల్సిందేనని ఆదేశం



ఏపీ న్యూస్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): తెలుగుదేశం పార్టీ నేతలపై మంత్రి నారా లోకేష్ సీరియస్ అయ్యారు. గత 4 వారాలుగా క్యాడర్ సమావేశాలు, గ్రీవెన్స్ నిర్వహించకపోవడంపై ఆయన మండిపడ్డారు. పార్టీ నేలతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన మైదకూరు, కడప, ప్రొద్దుటూరు, కమలాపురం ఎమ్మెల్యేలు, పులివెందుల, ధర్మవరం ఇన్‌చార్జ్‌లపై లోకేష్ సీరియస్ అయ్యారు. పార్టీ కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాల్సిందేనని ఆదేశించారు. ఇకపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన పరిస్థితులుంటాయని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. దీంతో పార్టీ ఇంచార్జులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి లోకేశ్ దృష్టి పెట్టడంతో ఇక నుంచి యాక్టివ్‌గా ఉండాలని నిర్ణయించారు. ఈ మేరకు లోకేష్‌కు వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ లైన్ తప్పకుండా పాటిస్తామని ఆయనకు చెప్పినట్లు సమాచారం.

# ప్రజాసమస్యల పై నిత్యం పోరాడేది సిపిఐ పార్టీ

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్




కుత్బుల్లాపూర్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఇంటింటికి సిపిఐ కార్యక్రమం సందర్భంగా నాలుగవ రోజు జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మ నగర్ లో ఇంటింటికి తిరిగి సిపిఐ చేసిన పోరాటాలను తెలుపుతూ ప్రజలకు కరపత్రాలను పంచడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైసమ్మ నగర్,అంజయ్య నగర్ లో మంచి నీటి కోసం సిపిఐ ఆధ్వర్యంలో నే బోర్ వెయ్యించి నీటిని సరఫరా చేసి నీటి ఇబ్బందిని తీర్చింది సిపిఐ పార్టీ అని అన్నారు. అన్ని విధుల్లో విధి దీపాలను,రోడ్లను వెయ్యించామని అన్నారు. ప్రజలందరికి నేటికీ సిపిఐ పార్టీ అంటే అభిమానమని,ఏ పార్టీలో ఉన్నపటికీ గూడు ను కల్పించిన చరిత్ర సిపిఐ పార్టీదని స్థానిక ప్రజలు తమ అభిప్రాయాలను తెలుపుతూ,సిపిఐ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుందని అలాంటి పార్టీ అధికారంలోకి వస్తే చూడాలని ఉందని తెలపడం సిపిఐ నాయకులకు స్ఫూర్తి కల్గిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వచ్చిన అభిప్రాయాలను,సమస్యలను నెరవేర్చడానికి సిపిఐ కార్యకర్తలు కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, సహాయ కార్యదర్శి హరినాథ్ ప్రజానాట్యమండలి అధ్యక్షులు ప్రవీణ్,బాబు,సిపిఐ నాయకులు నర్సింహారెడ్డి,మల్లేశ్వ,మహేందర్,వెంకటేష్,సహదేవ రెడ్డి, కీర్తి, కొండయ్య,నర్సయ్య,వీరాస్వామి,రాజు,సామెల్,యాదగిరి,కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా


## బొమ్మన బోయిన వెంకన్న యాదవ్ నియామకం



తొర్రూరు, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): పట్టణ కేంద్రానికి చెందిన బొమ్మనబోయిన వెంకన్న యాదవ్ ను కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శిగా టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలనుసారం జిల్లా డిసిసి అధ్యక్షురాలు భూక్య ఉమా నియమించడం జరిగింది. ఈసందర్భంగా వెంకన్న యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం లభిస్తుందని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు ఉన్నత పదవులు రావాలంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని పేర్కొంటూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసినందుకు ప్రతిష్టానం నన్ను గుర్తించి జిల్లా కార్యదర్శిగా నియమించినందుకు నాపై మరింత బాధ్యత పెరిగిందని తెలుపుతూ పార్టీ అభివృద్ధి కోసం నా వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ పదవి రావడానికి సహకరించిన టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కి,స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి, టిపిసిసి అధ్యక్షురాలు అనుమాండ్ల ఝాన్సీ రెడ్డికి, జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉమకి,జిల్లా,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన

## కార్పొరేటర్ కావటి కవిత



హనుమకొండ జిల్లా08 ఏప్రిల్(టీజీ24): హసన్‌పర్తి ఎర్రగట్టు గుట్టలో వెంకటేశ్వర కళ్యాణ మండపంలో మేకల గంగ - సారంగపాణి దంపతుల పుత్రుడు శ్రీనివాస్ యాదవ్ జ్యోతి వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 12వ డివిజన్ కార్పొరేటర్ కావటి కవిత హాజరై ,నూతన వధూవరులను ఆశీర్వదించి అక్షింతలు వేసి పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు యాదవ్,అంగన్వాడీ సీడీపీఓ విద్య,జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా,సూపర్వైజర్ లావణ్య,వరంగల్ జిల్లా జేఏసీ కో-ఆర్డినేటర్ జన్ను కోర్నెల్, కుటుంబ సభ్యులు మేకల సమ్మయ్య - ఉపేంద్ర, అంగన్వాడీ టీచర్లు,ఆయాలు,తదితరులు పాల్గొన్నారు.

# చట్ట విరుద్ధంగా ప్రైవేటు ఆసుపత్రులు గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేసినచో కఠిన చర్యలు తప్పవు



సూర్యాపేట, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేసిన,జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.జిల్లాలోని, అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ రెగ్యులేషన్ యాక్ట్ నిబంధనల రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని,జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, సూర్యాపేట నందు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశము నిర్వహించటం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రులు తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ రెగ్యులేషన్ యాక్ట్ (టీజీసీఈఏ) నిబంధనల రిజిస్ట్రేషన్ చేయాలని, అర్హతలు వున్నవాటికి సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని, మరియు గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు నిర్వహించినచో, వాటిని మూసి వేయాలని అన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రులపై, వాటి ప్రాంగణాలను సీల్ చేయడంతో సహా,కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. నవీకరించబడిన రికార్డులు, వైద్య బృందాలచే క్రమమైన తనిఖీలు మరియు అమలు కోసం పోలీసుల సమన్వయం తో, నిర్వహించాలన్నారు. తనిఖీ చేసిన 10 రోజుల్లోగా నిబంధనలను పాటించని ఆసుపత్రులను సీల్ చేయడానికి చర్యలు తీసుకోవాలి అన్నారు. పీసీపీఎన్డీటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, అన్ని రికార్డులను నవీకరించాలని అన్నీ ఆబార్షన్ ఆడిట్ చేయాలని, అబార్షన్ జరుగు కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, కలెక్టర్ అన్నారు.తదుపరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా,,పెండెం వెంకట రమణ మాట్లాడుతూ జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ నుండి 23 ప్రొవిజినల్, 28 పర్మినెంట్ అనుమతులు ఇచ్చామని, 31 ఎస్టాబ్లిష్మెంట్స్ తిరస్కరించమని, అర్హతలేని వైద్యుల స్కానింగ్ సెంటర్ మూసివేశామని తెలిపారు.ఈ కారక్రమశీలో అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, జిజి హెచ్ సూపరింటెండెంట్ శ్రావణ్ కుమార్, డా,, ప్రవీణ్ కుమార్, డా,, వెంకటేశ్వర్లు, ఐఎంఏ ప్రెసిడెంట్ డా,,ఆనంద్, డి డబ్ల్యు ఓ నర్సింహా రావు, డీఈఓ అశోక్, డిప్యూటీ డిఎంహెచ్వో డా,, చంద్ర శేఖర్, డా,,మాధవ్ కుమార్, ప్రోగ్రాం అధికారులు డా,, కోటి రత్నం, డా,, ప్రసిద్ధ్, డా,, నాజియా, డా,, శ్రీశైలం, డిప్యూటీ డి ఇ ఎం సంజీవ్ రెడ్డి, ఉపేందర్, కల్యాణ్

# మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, రైతులు ఎమ్మార్వో కి వినతిపత్రం అందజేత



సూర్యాపేట/నూతనకల్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు ఎమ్మార్వో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను వివరించారు. పంట కోత సీజన్‌లో సరైన మార్కెట్ సౌకర్యాలు లేకపోవడంతో, మధ్యవర్తుల చేతిలో నష్టపోతున్నామని,ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ, మండల మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, రైతులు ఎమ్మార్వో కు మండల కేంద్రంలోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే తమకు రవాణా ఖర్చులు, తగ్గడంతో పాటు, ప్రభుత్వ మద్దతు ధరకు పంటను విక్రయించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో సమయం, డబ్బు రెండూ వృథా అవుతున్నాయని పేర్కొన్నారు. ఈ వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మార్వో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. రైతులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని, తెలిపారు. మొక్కజొన్న రైతుల సమస్యపై ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో, తుంగతుర్తి నియోజకవర్గ కన్వీనర్ కాపా రవికుమార్ .జిల్లా ఉపాధ్యక్షుడు మాతంగి వెంకన్న, జిల్లా నాయకులు మద్ది సంజీవరెడ్డి,మండల నాయకులు కప్పల హనుమంత్, తదితరులు పాల్గొన్నారు.

## టి.బి ముక్త్ భారత్ కార్యక్రమం-ఉచిత ఆరోగ్య పరీక్షలు





వేలేరు, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): హనుమకొండ జిల్లా వేలేరు గ్రామపంచాయతీ ఆవరణలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టి.బి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు ఎక్స్-రే,పరీక్షలునిర్వహించడం తో పాటు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, వేలేరు గ్రామ సర్పంచ్ బిల్లా. యాదగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో మరిన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శ్రీకర్,డాక్టర్ విశాలి,హెచ్ఈఓవెంకటేశ్వర్లు, హెచ్ఎస్ కుమారస్వామి,హెచ్ఎస్ ప్రభావతి, హెచ్ఏ కనకమ్మ, హెచ్ఏ ప్రసాద్,ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సుమారు 120 మంది గ్రామస్తులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు.

## వెల్డింగ్ చేస్తుండగా ట్యాంకర్ బ్లాస్ట్.. వ్యక్తి మృతి



మునిపల్లి , 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): మునిపల్లి మండల పరిధిలోని బుదేరా గ్రామంలో ఓ ట్యాంకర్‌కు వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్యాంకర్ పేలింది. ఈ ఘటనలో వెల్డింగ్ చేస్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఎన్‌కే పల్లి గ్రామానికి చెందిన ఫరీద్ అనే వ్యక్తి గత కొంతకాలంగా మునిపల్లి మండలం బుదేరా చౌరస్తాలో వెల్డింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే బుధవారం ఓ ట్యాంకర్‌కు వెల్డింగ్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ట్యాంకర్ పేలింది. దీంతో వెల్డింగ్ చేస్తున్న ఫరీద్ (32)కు తీవ్ర గాయాలు కావడంతో సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. ఇదిలా ఉండగా ట్యాంకర్ పేలడంతో చుట్టుపక్కల భారీ శబ్దం రావడంతో సమీపంలోని ప్రజలు భయంతో పరుగులు తీశారు. ట్యాంకర్ భాగాలు చిందరవందరగా ఎగిరి పడినప్పటికీ ఎవరికి ప్రాణనష్టం జరగలేదు. అయితే రోడ్డుపై వెళ్తున్న ఓ కారు, లారీకి తాకి అద్దాలు ధ్వంసమైనట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని జరిగిన ఘటన పై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## భర్త గొడవ పడ్డాడని భార్య ఆత్మహత్య

జమ్మికుంట , 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): భర్త గొడవపడ్డాడని భార్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన జమ్మి కుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ కి చెందిన రాహుల్ కుమార్, పూజ కుమారి భార్య భర్తలు. వీరికి 2018లో పెళ్లి జరిగింది. వీరు జమ్మికుంటలోని కోరపల్లి రోడ్డు భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా అక్బర్ బాష ఇంట్లో అద్దెకు ఉంటారు. రాహుల్ కుమార్ రైస్ మిల్లు ఆపరేటర్ గా పని చేస్తుంటాడు. అయితే రోజు మాదిరిగా మంగళవారం రాత్రి రాహుల్ పని ముగించుకొని ఇంటికి వచ్చాక తన భార్య పూజ చేసిన రోటి, ఆలుగడ్డ కూర వండింది. తింటూ రోటీలు ఇంత మందంగా ఎందుకు చేశావు అని ప్రశ్నించాడు. ఈ విషయం పై భార్య, భర్తలకు గొడవ జరిగింది. తెల్లవారుజామున రాహుల్ రైస్ మిల్లు వద్దకు వెళ్లాడు. ఇంటి ఓనర్ అక్బర్ బాష చూసి నీ భార్య పూజా కుమారి ఉరేసుకుందని సమాచారం ఇచ్చాడు. వెంటనే హుటాహుటిన భర్త రాహుల్ చేరుకున్నాడు. అప్పటికే చీరతో అక్బర్ బాష రేకుల షెడ్డులోని ఇనుప పైపుకు ఉరేసుకున్న పూజా మరణించింది. భర్త రాహుల్ ఫిర్యాదు మేరకు జమ్మికుంట సీఐ రామకృష్ణ గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళా మృతి



కామారెడ్డి, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): రోడ్డు ప్రమాదంలో మహిళా మృతి చెందిన సంఘటన దేవుని పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్చి పూర్ గ్రామ శివారులో గల ఎన్.హెచ్ 44 పై విజయనగరం జిల్లా నుంచి బాసర కు వెళ్తున్న ఎస్వీఎల్ ట్రావెల్స్ బస్సు, ప్రయాణికులు వాష్ రూమ్ నిమిత్తం రోడ్డు పక్కన నిలిపాడు. విజయనగరం జిల్లా బొండంపల్లి మండలం, కంచిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కడియాల రమణమ్మ (55) రోడ్డు ప్రక్కన ఉండగా.. వేగంగా నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు ఆమెను ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన రమణమ్మ అక్కడి కక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి నలుగురు ఆడపిల్లలు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

KR TV క్రాంతి

# ఆరోగ్య క్రాంతి

గురువారం 09 ఏప్రిల్ 2026

epaper.krtvnews.com

# అంజీరా పండ్లు తింటే ఆ సమస్యలకు చక్కటి పరిష్కారం లభిస్తుంది తెలుసా..?



హెల్త్ న్యూస్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ప్రకృతి ప్రసాదాలైన పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వాటిలో ఏ పండు ప్రత్యేకత దానిదే. దేని ప్రయోజనాలు దానివే. అదేవిధంగా అంజీర పండ్ల ప్రత్యేకత అంజీర పండ్లకే ఉన్నది. అంజీర పండ్లు లేదా అత్తి పండ్లను ప్రతిరోజూ తినడంవల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా ఎండిన అత్తి పండ్లను నానబెట్టి తినాలని వైద్యులు సిఫారసు చేస్తున్నారు. ఇలా తినడంవల్ల రక్తం ఉత్పత్తి పెరిగి, బలహీనత తొలగిపోతుందని చెబుతున్నారు. అంజీరా పండ్లతో ఇంకా ఎలాంటి లాభాలు ఉన్నాయో తెలుసుకుందాం..

మలబద్ధకం సమస్యతో చాలామంది ఇబ్బంది పడుతుంటారు. సాధ్యమైనంత త్వరగా ఈ సమస్య తగ్గాలంటే రోజూ నానబెట్టిన అత్తిపండ్లను తినాలి. అత్తి పండ్లలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది ప్రీ బయోటిక్‌లా పనిచేస్తుంది. రోజూ అంజీరా తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మల విసర్జన సులభమవుతుంది.

అంజీర పండ్లలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తపోటు నియంత్రణకు తోడ్పడుతుంది. ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్స్ కూడా పుష్కలంగా ఉంటాయి. చర్మ ఆరోగ్యానికి అవసరమైన విటమిన్‌లు సి, ఇ, ఎ కూడా దీనిలో ఉన్నాయి. అందేరూ అంజీర పండ్లు చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. దీనివల్ల చర్మం యవ్వనంగా, ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

ఎముకలను పరిపుష్టం చేయడానికి కూడా అంజీర పండ్లు తోడ్పడుతాయి. నానబెట్టిన అత్తిపండ్లలో క్యాల్షియం, ఫాస్పరస్ ఎక్కువగా ఉండటంవల్ల ఎముకలు దృఢంగా తయారవుతాయి.

నానబెట్టిన అత్తి పండ్లను తినడంవల్ల శరీరంలో ఆక్సిడేషన్ ఒత్తిడి తగ్గుతుంది. డయాబెటిస్ ఉన్నవారు వీటిని కొద్ది మొత్తంలో తినవచ్చు. వీటివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు కూడా తగ్గుతాయి. అయితే వీటిలో ఉండే తీపి కారణంగా చాలామంది డయాబెటిస్ రోగులు వీటిని తినేందుకు భయపడతారు. కానీ రోజుకు ఒకట్రెండు తినడంవల్ల ఎలాంటి సమస్యా ఉండదని నిపుణులు చెబుతున్నారు.

స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉన్నవారు ప్రతిరోజు పాలలో నానబెట్టిన అంజీర పండ్లను తినడంవల్ల మేలు జరుగుతుంది. ఇలా చేయడంవల్ల వారిలో స్పెర్మ్ కౌంట్ పెరుగుతుంది. కాబట్టి స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉండటంవల్ల సంతానలేమి సమస్యతో బాధపడుతున్న వారికి ఇది చక్కటి పరిష్కారంగా చెప్పవచ్చు.

సాధారణంగా చిన్న పిల్లలు, మహిళలు ఎక్కువగా రక్తహీనత సమస్యతో బాధపడుతుంటారు. అలాంటి వారు ప్రతిరోజు అంజీర పండ్లను తినడంవల్ల ప్రయోజనం ఉంటుంది. రక్తం ఉత్పత్తి పెరిగి రక్తహీనత సమస్య తగ్గుతుంది.

మహిళలు రుతుస్రావానికి ముందు, హార్మోన్‌ల మార్పుల సమయంలో అత్తిపండ్లను తినడం మంచిది. అదేవిధంగా మెనోపాజ్ దశలో అత్తిపండ్లు తినడంవల్ల అనేక రుతు సంబంధ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. కాబట్టి మెనోపాజ్ దశకు దగ్గరలో ఉన్నవాళ్లు అంజీర పండ్లను తినడం అలవాటు చేసుకోవాలి.

# ఫైబర్ అధికంగా లభించే ధాన్యాలు ఇవే.. వీటిని తీసుకుంటే ఎంతో మేలు



హెల్త్ న్యూస్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఆహారంలో ఉండే ఫైబర్ శరీరానికి ఎంతో అవసరమైన పోషక పదార్థం. పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, పప్పుధాన్యాల్లో ఇది సమృద్ధిగా లభిస్తుంది. జీర్ణక్రియ మెరుగుపరచడం, వ్యర్థాల తొలగింపు, రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ, కొలెస్ట్రాల్ తగ్గించడం, ఎక్కువసేపు తృప్తిగా ఉంచడం వంటి అనేక ప్రయోజనాలు ఫైబర్ వల్ల లభిస్తాయి. అయితే ఫైబర్ ను చాలా మంది తక్కువగా అంచనా వేస్తారని నిపుణులు చెబుతున్నారు. ధాన్యాలను ఫైబర్ పరిమాణం ఆధారంగా ర్యాంక్ చేస్తూ సరైన ఆహార ఎంపికలు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఫైబర్ పరంగా ధాన్యాలు ఏయే స్థానాల్లో ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

బల్గర్, స్టీల్-కట్ ఓట్స్, పర్ల్ బార్లీ..


ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారాల్లో మొదటి స్థానంలో బల్గర్ ఉంది. ఇది అధిక ఫైబర్ కలిగిన సంపూర్ణ ధాన్యం. జీర్ణక్రియకు సహాయపడటంతో పాటు, జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. తక్కువ క్యాలరీలతో ఎక్కువసేపు తృప్తిగా ఉంచి బరువు నియంత్రణకు దోహదపడుతుంది. సాధారణంగా ఉడికించి తింటారు, అయితే వేయించడం, బేక్ చేయడం లేదా రోస్ట్ చేయడం కూడా చేస్తారు. రెండో స్థానంలో స్టీల్-కట్ ఓట్స్ ఉన్నాయి. వీటిని ఐరిష్ ఓట్స్ అని కూడా అంటారు. ఇవి ఫైబర్, స్టార్చ్ అధికంగా ఉండటంతో బరువు తగ్గేందుకు అనుకూలం. వీటిని వండడానికి 15-20 నిమిషాలు పడుతుంది. పాయసం వంటి వంటకాలకు ఎక్కువగా ఉపయోగిస్తారు. అలాగే మూడో స్థానంలో పర్ల్ బార్లీ ఉంది. ఇది బార్లీ గింజలపై ఉన్న బయటి పొరను తొలగించిన రూపం. సూపులు, స్ట్యూలు, రిసొట్టో వంటి వంటల్లో దీన్ని ఉపయోగిస్తారు. దీని టెక్స్చర్ మృదువుగా ఉండటంతోపాటు ద్రవాలను గట్టిపరిచే గుణం ఉంది.

క్వినోవా, వైల్డ్ రైస్, బ్రౌన్ రైస్..

తర్వాత స్థానంలో క్వినోవా ఉంది. ఇది గ్లూటెన్ లేని ప్సూడో-సిరియల్. చాలా ధాన్యాలతో పోలిస్తే దాదాపు రెట్టింపు ఫైబర్ కలిగి ఉంటుంది. జీర్ణక్రియకు మేలు చేయడంతోపాటు, పూర్తి ప్రోటీన్‌గా పనిచేసి ఆకలి నియంత్రణ, రక్త చక్కెర నియంత్రణలో సహాయపడుతుంది. ఆ తరువాత స్థానంలో వైల్డ్ రైస్ ఉంది. ఇది వాస్తవానికి ఒక గడ్డి విత్తనం. సాధారణ తెల్ల బియ్యంతో పోలిస్తే అధిక ఫైబర్, ప్రోటీన్ కలిగి ఉండటంతో పోషకంగా మెరుగైన ఎంపికగా పరిగణిస్తారు. బ్రౌన్ రైస్ కూడా మంచి ఫైబర్ ఉన్న సంపూర్ణ ధాన్యం. ఇది బరువు నియంత్రణ, గుండె ఆరోగ్యం, రక్త చక్కెర నియంత్రణకు సహాయపడుతుంది. పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. అలాగే పారా బాయిల్డ్ రైస్ అనేది ప్రాసెసింగ్‌కు ముందు గింజను కొంతవరకు మరిగించడం ద్వారా తయారు చేసే బియ్యం. ఈ ప్రక్రియ వల్ల దాని పోషక విలువలు కొంత మెరుగవుతాయి.

వైట్ రైస్..

ఇక అన్నింటికంటే చివరగా వైట్ రైస్ ఉంది. జాస్మిన్, బాస్మతి వంటి తెల్ల బియ్యాలు ఫైబర్ పరంగా తక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఫైబర్ తీసుకునే పరిమాణాన్ని ఒక్కసారిగా పెంచకుండా క్రమంగా పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి వారం సుమారు 5 గ్రాముల చొప్పున పెంచడం, తగినంత నీరు తాగడం, భోజనం తరువాత తేలికపాటి శారీరక కదలికలు చేయడం అవసరమని చెప్పారు. ఫైబర్ కేవలం జీర్ణక్రియకే కాదు, మొత్తం మెటబాలిజం ఆరోగ్యానికి మద్దతు ఇస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.



క్రాంతి గురువారం 09 ఏప్రిల్ 2026

# క్రీడలు

epaper.krtvnews.com



## ఐపీఎల్ పేరుతో సైబర్ నేరాలు.. సజ్జనార్ హెచ్చరిక



స్పోర్ట్స్ న్యూస్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): ఐపీఎల్ క్రికెట్ ఫీవర్‌ను అడ్డం పెట్టుకుని అమాయక ప్రజలను నిలువునా దోచుకుంటున్న సైబర్ ముఠాల పట్ల హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరికలు జారీ చేసారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్ ఉన్న కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు కేవలం తమ స్వలాభం కోసం, నిర్వాహకులు ఇచ్చే కమీషన్ల కోసం 'ఫేక్ ప్రిడిక్షన్' ఛానెళ్లను ప్రమోట్ చేస్తూ సామాన్యులను తప్పుదోవ పట్టిస్తున్నారు. "టాస్ ఎవరు గెలుస్తారు?", "ఏ టీమ్ విజయం సాధిస్తుంది?" వంటి వివరాలను తాము ముందే ఖచ్చితంగా చెబుతామంటూ వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో చేరమని ఊరిస్తూ, చివరికి వారిని తీరని ఆర్థిక కష్టాల్లోకి నెట్టేస్తున్నారని కమిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం డబ్బు కోసం అసత్య ప్రచారాలు చేస్తూ యువతను బెట్టింగ్ ఊబిలోకి లాగుతున్న ఇన్‌ఫ్లూయెన్సర్ల తీరుపై పోలీసులు నిశితంగా నిఘా ఉంచారు.

ఈ నెట్‌వర్క్‌ను అరికట్టేందుకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం ఇప్పటికే ఉక్కుపాదం మోపింది. గత నెల రోజుల్లోనే సుమారు 494 పెయిడ్ ప్రకటనలను గుర్తించి తొలగించడమే కాకుండా, వీటిని విపరీతంగా ప్రచారం చేస్తున్న 129 సోషల్ మీడియా ప్రొఫైళ్లను బ్లాక్ చేయించారు. క్రికెట్ బెట్టింగ్ అనేది చట్టవిరుద్ధమని, ఇలాంటి ఫేక్ ప్రిడిక్షన్ ఛానెళ్ల మాటలు నమ్మి కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దని పోలీసులు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నిఘా కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, వీటి వెనుక ఉన్న సూత్రధారులను పట్టుకునేందుకు నిరంతరం కొనసాగుతుందని, బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినోదం కోసం చూసే క్రికెట్‌ను వ్యసనంగా మార్చుకుని సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దని వారు సూచిస్తున్నారు.

## షూటింగ్ వరల్డ్ కప్‌లో సంచలనం.. భారత్‌కు గోల్డ్ మెడల్



స్పోర్ట్స్ న్యూస్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ ప్రపంచకప్‌లో భారత షూటర్లు సరికొత్త చరిత్ర సృష్టించారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత జంట పాలక్, ముకేశ్ నెల్లవల్లి అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ క్రమంలో వారు పాత ప్రపంచ రికార్డును బద్దలు కొట్టి సరికొత్త రికార్డును నెలకొల్పారు. ఫైనల్ పోరులో పాలక్, ముకేశ్ జోడీ అత్యంత కచ్చితత్వంతో షూట్ చేసి, ప్రపంచ రికార్డు స్కోరును నమోదు చేశారు. వీరిద్దరి సమన్వయం మరియు ఏకాగ్రత భారత క్రీడాభిమానులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ విజయంతో షూటింగ్ విభాగంలో భారత్ తన తిరుగులేని ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది. ముఖ్యంగా యువ షూటర్లు అంతర్జాతీయ వేదికలపై ప్రపంచ రికార్డులను తిరగరాయడం విశేషం. ఈ టోర్నమెంట్‌లో ముకేశ్ నెల్లవల్లి తన అసాధారణ ప్రతిభను చాటారు. పాలక్ అందించిన సహకారంతో ఈ జంట ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా లక్ష్యాన్ని ఛేదించింది.

క్రీడా వర్గాల ప్రశంసలు..

ప్రపంచ రికార్డును బద్దలు కొట్టి స్వర్ణం గెలిచిన ఈ యువ జోడీని భారత క్రీడా మంత్రిత్వ శాఖ, నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు అభినందించారు. రాబోయే ఒలింపిక్స్‌లో భారత్‌కు ఈ విభాగంలో మరిన్ని పతకాలు వచ్చే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ వేదికపై భారత త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా

## మళ్లీ కలిసిన స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ వీడియో వైరల్.. పెళ్లి చేసుకోబోతున్నారా..?



స్పోర్ట్స్ న్యూస్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాష్ ముచ్చల్ మరోసారి వార్తల్లో నిలిచారు. వీరిద్దరూ మళ్లీ కలుస్తున్నారనే ఊహాగానాలు సోషల్ మీడియాలో జోరుగా వినిపిస్తున్నాయి. తాజాగా వైరల్ అవుతున్న ఒక వీడియో ఈ చర్చలకు మరింత ఊతమిచ్చింది. ఆ వీడియోలో పలాష్ ముచ్చల్ సోదరి పలక్ ముచ్చల్, ఆమె భర్త మిథున్‌తో కలిసి స్మృతి మంధాన తండ్రితో కనిపించడం గమనార్హం. ముంబైలోని ఒక రెస్టారెంట్ బయట ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. వీడియోలో పలక్.. స్మృతి తండ్రికి నమస్కారం చేయగా, ఆయన ఆమెను ఆశీర్వదించడం కనిపిస్తుంది. దీంతో ఇరు కుటుంబాల మధ్య సంబంధాలు సవ్యంగానే ఉన్నాయన్న భావన వ్యక్తమవుతోంది.

గతంలో 2025 నవంబర్‌లో స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ వివాహ నిశ్చితార్థం జరిగింది. పెళ్లి ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. అయితే, పెళ్లికి ముందు రోజు రాత్రే ఈ సంబంధం విరిగిపోయింది. పలాష్ ముచ్చల్ మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడనే ఆరోపణలు వెలుగులోకి రావడంతో ఈ వివాహం ఆగిపోయినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలను పలాష్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ వచ్చాడు. ప్రస్తుతం వైరల్ అవుతున్న వీడియోతో ఇద్దరూ మళ్లీ కలవబోతున్నారన్న ఊహాగానాలు జోరందుకున్నాయి. కొందరు అభిమానులు ఈ జంట మళ్లీ ఒక్కటవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తుంటే, మరికొందరు మాత్రం జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు. అయితే, ఈ వీడియో పాతదా లేక తాజాదా అన్నది అధికారికంగా ధృవీకరించబడలేదు. అయినప్పటికీ సోషల్ మీడియాలో ఇది సంచలనం సృష్టిస్తోంది. స్మృతి మంధాన ఇప్పటివరకు ఈ విషయంపై స్పందించకపోవడం కూడా ఈ వార్తలకు మరింత ఆసక్తిని

## "నువ్వు గ్రేట్ రా బుడ్డోడా".. వైభవ్‌ను చూడగానే ఓటమిని మరిచి ముగ్ధుడైన హార్దిక్ పాండ్యా!




స్పోర్ట్స్ న్యూస్, 08 ఏప్రిల్ (క్రాంతి న్యూస్): మంగళవారం రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మధ్య జరిగిన పోరు మామూలుది కాదు. ఓ 15 ఏళ్ల కుర్రాడికి, ప్రపంచంలోనే అత్యంత డేంజరెస్ యార్కర్ బుమ్రాకు మధ్య జరిగిన సమరం ఇది. మ్యాచ్‌కు ముందు బుమ్రా – వైభవ్ సూర్య వంశీ కాంబినేషన్ కోసం అందరూ ఎదురు చూశారు. ఈ 15 ఏళ్ల బుడ్డోడు ఇప్పటికే వరుసగా తన బ్యాట్‌తో విధ్వంసం సృష్టిస్తున్నాడు. కానీ బుమ్రాను మాత్రం ఒక్కసారి కూడా ఎదుర్కోలేదు. నిన్నటి మ్యాచ్‌లో తొలిసారిగా వైభవ్ బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. ఫస్ట్ బాల్‌నే ఈజీగా బౌండరీ దాటించాడు. ప్రపంచ మేటి బౌలర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లోనే రెండు భారీ సిక్సర్లు బాది అందరినీ ఆశ్చర్యపరిచాడు. కేవలం 14 బంతుల్లోనే 39 పరుగులు చేశాడు. ఒకవైపు సూర్యవంశీ మెరుపులు మెరిపిస్తుంటే, మరోవైపు యశస్వి జైస్వాల్ 32 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సర్లతో 77 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వీరిద్దరి వీరవిహారంతో రాజస్థాన్ నిర్ణీత 11 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 150 పరుగుల భారీ స్కోరు సాధించింది. ముంబై ఈ లక్ష్యాన్ని ఛేజ్ చేయలేకపోయింది. దీంతో రాజస్థాన్ 27 పరుగుల తేడాతో గెలుపొందింది.

అయితే మ్యాచ్ అనంతరం షేక్ హ్యాండ్ ఇస్తున్న క్రమంలో ఓ దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. వైభవ్ సూర్య వంశీ దగ్గరకు రాగానే హార్దిక్ పాండ్యా తన జట్టు ఓటమిపాలైందన్న విషయం మర్చిపోయాడు. ఆ క్షణంలో ఈ 15 ఏళ్ల కుర్రాడి ప్రతిభను చూసి ముగ్ధుడైపోయాడు. సూర్యవంశీ వద్దకు వెళ్లి ప్రత్యేకంగా అభినందించడమే కాకుండా, అతనిలో ఉన్న నిర్భయత్వం, షాట్లు ఆడే తీరు అద్భుతమని కొనియాడాడు. మ్యాచ్‌కు ముందు కూడా తమ జట్టులో సూర్యవంశీ గురించే ఎక్కువ చర్చ జరిగిందని, ఇంత చిన్న వయసులో అతను ఆడుతున్న తీరు భవిష్యత్తుపై ఆశలు కలిగిస్తోందని పాండ్యా ప్రశంసల వర్షం కురిపించాడు. ఈ బుడ్డోడు మాత్రం బుమ్రా బౌలింగ్‌లో

# ‘పెద్ది’ నుంచి మృణాల్ ఔట్..

## మిస్ ఇండియా బ్యూటీకి బంపర్ ఆఫర్!




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ బుచ్చిబాబు సనా, కాంబోలో తెరకెక్కుతున్న ‘పెద్ది’ సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ మాస్ అండ్ ఎమోషనల్ డ్రామా గురించి తాజాగా ఫిలిం నగర్ సర్కిల్స్‌లో ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ వైరల్ అవుతోంది. అదే ఈ సినిమాలో ఉండబోయే స్పెషల్ ఐటెం సాంగ్ గురించి పలు పోస్టులు హల్ చల్ చేస్తున్నాయి. గత కొద్ది రోజులుగా ఈ పాటలో ‘సీతారామం’ బ్యూటీ మృణాల్ ఠాకూర్ మెరుస్తుందని వార్తలు వచ్చాయి. దీంతో రామ్ చరణ్ సరసన స్టెప్పులు వేసేది మృణాల్ అని అంతా భావించారు. కానీ, చివరి నిమిషంలో ఈ భామ తప్పుకున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. మృణాల్ ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకోగా.. ఆమె ప్లేస్‌లోకి టాలీవుడ్ యంగ్ అండ్ హాట్ సెన్సేషన్ మానస శర్మ ఎంట్రీ ఇచ్చినట్లు సోషల్ మీడియాలో పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. ఈ అమ్మడుని మేకర్స్ సంప్రదించగా.. మానస కూడా గ్రీన్ సిగ్న ఇచ్చినట్లు సమాచారం. ఇక ‘కపుల్ ఫ్రెండ్లీ’ సినిమాతో యూత్‌కు దగ్గరైన ఈ మిస్ ఇండియా బ్యూటీకి, రెండో చిత్రానికే గ్లోబల్ స్టార్‌తో స్క్రీన్ షేర్ చేసుకునే గోల్డెన్ ఛాన్స్ దక్కింది. ఈ సాంగ్ కోసం బుచ్చిబాబు అదిరిపోయే స్టెప్పులు ప్లాన్ చేశారని, మానస తన గ్లామర్‌తో ఈ పాటకు సరికొత్త ఊపు తీసుకురాబోతుందని సమాచారం.

నెటిజన్లు సైతం మానసకు ఇది మామూలు ఆఫర్ కాదు.. బంపర్ ఆఫర్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇందులో నిజమెంత అనేది తెలియనప్పటికీ ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు మాత్రం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. మరోవైపు, ఈ సినిమా విడుదల తేదీపై కూడా ఒక అప్‌డేట్ వినిపిస్తోంది. ముందుగా ఏప్రిల్ 30న రిలీజ్ చేస్తామని ప్రకటించినప్పటికీ, క్వాలిటీ విషయంలో ఎక్కడా తగ్గకూడదని భావిస్తున్న చిత్ర యూనిట్.. పోస్ట్ ప్రొడక్షన్ పనుల కోసం మరికొంత సమయం తీసుకోనుందట. దీనివల్ల సినిమా జూన్ చివరి వారంలో థియేటర్లలోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ వంటి స్టార్ యాక్టర్స్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇక రామ్ చరణ్ మాస్ మేకోవర్, మానస శర్మ స్పెషల్ సాంగ్ ఈ సినిమాకు హైలైట్‌గా నిలవనున్నట్లు టాక్.

# గుండుతో ఊహించని షాకిచ్చిన ఐకాన్ స్టార్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ అందింది. టాలీవుడ్ సెన్సేషన్ బన్నీ, కోలీవుడ్ మాస్ డైరెక్టర్ అట్లీ కాంబోలో రాబోతున్న ప్రతిష్టాత్మక చిత్రం టైటిల్ అండ్ ఫస్ట్ లుక్ విడుదలైంది. ఈ చిత్రానికి ‘రాకా’ అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేసినట్లు ప్రకటించారు. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ విషయానికొస్తే.. అల్లు అర్జున్ లుక్ చూసి సినీ లోకం షాక్ అవుతోంది. గుండుతో , కళ్లకు కాటుక పెట్టుకుని, సీరియస్‌గా కెమెరా వైపు చూస్తున్న లుక్ చూసి జనాలు నోరెళ్లబెడుతున్నారు. అంతేకాకుండా ఆయన నుదిటిపై వైకింగ్ ట్యాటూలను పోలిన గుర్తులు ఉన్నాయి. అలాగే నిన్నటి టీజర్‌లో చూపించిన జంతువు గోళ్లు ఈ పోస్టర్‌లో కూడా హైలెట్‌గా నిలిచాయి. అట్లీ ఈ సారి ఏదో పెద్ద విజువల్ వండర్‌నే ప్లాన్ చేసినట్లు అర్థమవుతోంది. ‘రాకా’ ఫస్ట్ లుక్ చూస్తుంటే ఇదొక ఊహకందని పీరియాడికల్ యాక్షన్ డ్రామా అనే చర్చ మొదలైంది.

ఇక అల్లు అర్జున్ కెరీర్‌లోనే ఇది అత్యంత వైవిధ్యమైన, భయంకరమైన లుక్ అని ఫ్యాన్స్ సోషల్ మీడియాలో రచ్చ చేస్తున్నారు. కాగా.. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్టులో గ్లోబల్ బ్యూటీ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. ఈ సినిమా మేకింగ్ కోసం నిర్మాత కళానిధి మారన్, అల్లు అర్జున్, అట్లీ ఇప్పటికే లాస్ ఏంజిల్స్ వెళ్లి ఐరన్ మ్యాన్ 2, ట్రాన్స్‌ఫార్మర్స్ వంటి హాలీవుడ్ చిత్రాలకు పనిచేసిన వీఎఫ్ఎక్స్ టీమ్‌ను కలిశారు. ఆ టీమ్ సభ్యులు మాట్లాడుతూ.. “మేము ఇప్పటివరకు చదివిన స్క్రిప్టుల్లో ఇది చాలా ప్రత్యేకం” అని చెప్పడం సినిమా రేంజ్‌ను మరింత పెంచింది. ఇక రణ్‌వీర్ సింగ్ కూడా ఈ మూవీ సెట్స్‌కు వెళ్లి, “భారతీయ సినిమాలో ఇప్పటివరకు చూడని ఒక అద్భుతాన్ని అట్లీ సృష్టిస్తున్నాడు” అని ప్రశంసించారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది భారీ అంచనాల మధ్య విడుదల కాబోతుంది.




# NTRNeel షూటింగ్‌కు బ్రేక్..?

## క్లారిటీ ఇచ్చిన మైత్రీ మూవీ మేకర్స్

యంగ్ టైగర్ ఎన్టీఆర్, కెజియఫ్ ఫేమ్ ప్రశాంత్ నీల్ కాంబోలో రాబోతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై గత కొద్దిరోజులుగా నెట్టింట రకరకాల పుకార్లు షికారు చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో ఎన్టీఆర్ లుక్ విషయంలో ప్రశాంత్ నీల్ సంతృప్తిగా లేరని, అందుకే షూటింగ్‌ను అర్ధాంతరంగా నిలిపివేశారనే వార్తలు అభిమానులను కలవరపెట్టాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్ పుకార్లు షికార్ చేస్తుండగా.. నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ రంగంలోకి దిగి అసలు నిజాన్ని బయటపెట్టింది. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను మైత్రీ మూవీ మేకర్స్ తీవ్రంగా ఖండించింది. “హీరో లుక్ విషయంలో గానీ, షెడ్యూల్ రద్దు విషయంలో గానీ వస్తున్న వార్తల్లో ఇసుమంతైనా నిజం లేదు. సినిమా ప్లాన్ ప్రకారమే ముందుకు సాగుతోంది. ప్రస్తుతం కేవలం ప్రిపరేషన్ కోసం చిన్న విరామం తీసుకున్నాం అంతే. తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, వ్యాప్తి చేయవద్దని మేము అందరినీ కోరుతున్నాము. అధికారిక అప్‌డేట్‌లు ఎల్లప్పుడూ మా నుండే వస్తాయి.

దయచేసి ఎవరూ ఈ ప్రాజెక్ట్‌పై రూమర్స్ సృష్టించొద్దు” అని ట్విట్టర్ వేదికగా ఘాటుగా స్పందించారు. ఈ క్లారిటీతో నందమూరి అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సినిమాకు ‘డ్రాగన్’ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ‘దేవర’తో మాస్ జాతర మొదలుపెట్టిన ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సరికొత్త అవతారంలో కనిపించబోతున్నారు. ఇందులో కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. రవి బస్రూర్ సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానుంది. ప్రశాంత్ నీల్ శైలిలో ఉండే డార్క్ థీమ్, భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు ఈ చిత్రంలో నెక్స్ట్ లెవల్‌లో ఉండబోతున్నాయని సమాచారం.




Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com